
ఏషియన్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌కు జోగన్నపాలెం క్రీడాకారిణి జెస్సీరాజు సౌత్ కొరియాకు పయనం 7

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమ, అభివృద్ధికి అండగా నిలుస్తోంది. బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ వర్గాలతో పాటు ఎస్సీ వర్గాల వారి ఆర్థిక సాధికారిత, సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి కోసం పలు పథకాల అమలుకు చర్యలు చేపట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరం రుణాల మంజూరుకు గత డిసెంబర్‌లో దరఖాస్తులను ఆహ్వానించింది. వేగంగా వడపోత చేసినా.. చివరకు యూనిట్ల మంజూరు నిలిచిపోయింది. మూడు నెలలుగా రుణాల మంజూరు ఊసే లేదు. బీసీ, ఈబీసీ, ఎస్సీ సామాజికవర్గాల వారు రుణాలు మంజూరు చేస్తే యూనిట్ల స్థాపనకు ఎదురుచూస్తున్నారు.



ఎదురుచూపులు ఎన్నాళ్లు..?

- ఉపాధి యూనిట్ల కోసం నిరీక్షణ
- ఉమ్మడి జిల్లాలో 79,625 దరఖాస్తులు
- బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్.. ఎస్సీ కార్పొరేషన్ రుణాలు లేవు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

బీసీ, ఎస్సీ, కాపు వర్గాల అభ్యున్నతికి టీడీపీ ప్రభుత్వం ముందుంటుంది. జగన్ సర్కార్‌లో ఈ వర్గాలకు రుణాల మాట లేకుండా చేసేశారు. కూటమి ప్రభుత్వం సుదీర్ఘ కసరత్తు చేసి బీసీ, ఈబీసీ, కాపు, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా యువత ఉపాధి నిమిత్తం యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం నడుం బిగించింది. రుణాల కోసం బీసీ వర్గాలతో పాటు అగ్రకులాల్లో దారిద్ర్య రేఖకు దిగువన వైశ్య, బ్రాహ్మణ, రెడ్డి, క్షత్రియ వర్గాల వారు దరఖాస్తు చేసుకున్నారు.

చంద్రన్న స్వయం ఉపాధి పథకంలో బీసీలకు కొన్నిచోట్ల జనరిక్ మెడికల్ షాపులను కేటాయించాలని నిర్ణయించారు. కాపు కార్పొరేషన్ ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వ్యయంతో చిన్న పరిశ్రమల స్థాపనకు అడుగులు వేశారు. దరఖాస్తులు స్వీకరించి ఇంటర్వ్యూ అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేశారు. మండల, పట్టణాల్లో యూనిట్ల స్థాపనకు బ్యాంకులకు ఆయా జాబితాలు చేరాయి. యూనిట్లు స్థాపిస్తున్నామనుకునే తరుణంలో మరింత మందికి ప్రయోజనం చేకూర్చాలన్న భావనతో ప్రభుత్వం యూనిట్ల మంజూరు నిలిపేసింది. అధికారిక ఉత్తర్వులు లేకున్నా యథాతథ స్థితి కొనసాగించాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చింది. దీంతో లబ్ధిదారుల జాబితా పక్కన పెట్టేయాల్సిన పరిస్థితి నెలకొంది. యూనిట్ల సంఖ్య పెంచి, ఇప్పుడున్న సబ్సిడీ 30 శాతం నుంచి 50 శాతం పెంచే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఇప్పటికే ఒక సంవత్సరం గడిచిపోగా, 2025-26 ఆర్థిక సంవత్సరం యూనిట్లు మంజూరుకు దరఖాస్తులు ప్రక్రియ ఎప్పుడు ప్రారంభిస్తారని పలువురు ఎదురుచూస్తున్నారు.

కార్పొరేషన్ రుణాల జాడే లేదు!

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అమలు

యూనిట్ల మంజూరు నిలుపుదలపై బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.పుష్పలతను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ప్రభుత్వ ఉత్తర్వులు రావాల్సి ఉందన్నారు. యూనిట్ల మంజూరు ప్రక్రియ నిలిపివేయాలని మౌఖిక ఆదేశాలు వచ్చాయన్నారు. మంజూరు ఉత్తర్వుల కోసం చూస్తున్నామన్నారు.

ఉమ్మడి జిల్లాకు 3,802 యూనిట్లు.. దరఖాస్తులు 79 వేలు

ఉమ్మడి జిల్లాకు 3,802 యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించారు. మొత్తం 79,625 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఏలూరు జిల్లాలో స్వయం ఉపాధి రుణాల కోసం 33,751 మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. పశ్చిమలో 35,874 మంది దరఖాస్తులను సమర్పించారు. ప్రభుత్వం జిల్లాకు 1,901 చొప్పున యూనిట్లు లక్ష్యంగా కేటాయించడంతో సర్దుబాటు సమస్యగా మారింది. ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 112, కమ్మ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కింద 729 మంది, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా 93 మంది, రెడ్డి సంఘం ద్వారా 94, కాపు వెల్ఫేర్ కింద 9,392, ఆర్యవైశ్య కార్పొరేషన్ కింద 1057, బీసీ కార్పొరేషన్ 21,993 మంది, ఈబీసీ 281 మంది యూనిట్ల మంజూరుకు దరఖాస్తు చేసుకున్నారు. కనీసం జిల్లాకు 3 వేల యూనిట్లు అయినా మంజూరు చేయాలనేది ప్రభుత్వ తాజా నిర్ణయం.

నూజివీడు నియోజకవర్గంలో మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. తవ్వకాలపై పత్రికల్లో కథనాలు రావడంతో మంత్రి, అధికారులు స్పందించడంతో తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నారు. తిరిగి రెండు, మూడు రోజులకు షరా 'మామూలు..' తాజాగా ఆగిరిపల్లి మండలం తాడేపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని నెల్లిగట్టును ఎలాంటి అనుమతులు లేకుండానే కొల్లగొడుతున్నారు.



తవ్వేస్తున్నారు..!

నూజివీడు నియోజకవర్గంలో అక్రమార్కుల దందా

- చెరువులు తవ్వి.. మట్టి, గ్రావెల్ అక్రమ తరలింపు
- రాత్రివేళ నిరాటంకంగా తవ్వకాలు
- మంత్రి, అధికారులు హెచ్చరించినా బేఖాతరు

నూజివీడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలో మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు, తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. నూజివీడు పట్టణంలో పెద్ద చెరువు, నూజివీడు రూరల్ పోలనానపల్లి చెరువులలో అక్రమ మట్టి తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి. ఆగిరిపల్లి మండలం నెల్లిగట్టులో గ్రావెల్, మట్టి కలిసి ఉండడంతో విజయవాడ, పరిసర ప్రాంతాలలో డిమాండ్ ఉంది. పది రోజులుగా రాత్రి వేళ పెద్ద సంఖ్యలో టిప్పర్ల ద్వారా విజయవాడ ప్రాంతాలలో వెంచర్లకు, నూతన కర్మాగారాలకు గ్రావెల్ మట్టి తరలిస్తున్నట్లు సమాచారం. స్థానికంగా రైతు అవసరాల కోసం ట్రాక్టర్లు లేదా ఎడ్లబండ్ల ద్వారా మట్టి తోలకాలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ సాకుతో కొందరు రాజకీయ నేతలు అక్రమ తవ్వకాలను తెరతీశారు. నెల్లిగట్టు ఈ ప్రాంతం నుంచి రాత్రివేళ జేసీబీలతో తవ్వి టిప్పర్ల తరలిస్తున్నాట్లు స్థానికులు చెబుతున్నారు. స్థానికులు రాత్రివేళ టిప్పర్లను ఆపే ధైర్యం చేయలేకపోతున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినా ఎవరూ స్పందించలేదన్నారు. రెండు రోజులుగా వర్షాలు పడడంతో తాత్కాలికంగా తవ్వకాలు ఆగినట్లు తెలుస్తోంది. వర్షాలు ఆగిన తరువాత తిరిగి మట్టి సరఫరా జరుగుతుందని అక్రమార్కులు మట్టి కొనుగోలుదారులకు చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది.

వినూత్నం

బ్యాక్ బెంచ్ లేదు!

బ్యాక్ బెంచ్ విద్యార్థులంటే చులకన.. వారు సరిగా చదవరనే భావన చాలామందిలో ఉంది. చదువులో వెనకబడిన విద్యార్థులు ఆత్మన్యూనతతో వెనక బెంచికి వెళుతున్నారు. దీనికితోడు ఉపాధ్యాయుల దృష్టి కూడా ఆఖరి బెంచ్ విద్యార్థులపై తక్కువ. వీటన్నిటికి చెక్‌పెడుతూ అధికారులు, ఉపాధ్యాయులు ప్రయోగం చేశారు. ధర్మాజీగూడెం బాలికల పాఠశాలను జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. తరగతి గదిలో బెంచిలను యూ ఆకారంలో అమర్చారు. ఉపాధ్యాయుడు చెప్పేది విద్యార్థులు వినడానికి, మాట్లాడటానికి సులభతరంగా ఉంటుందని, విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారని పంకజ్ కుమార్ తెలిపారు. జీసీడీఏ నవీనకుమారి, ఎంఈవో జె.రవీంద్ర, హెచ్‌ఎం ఎస్.త్రిపుర సుందరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి ఈ కొత్త విధానం పరిచయం చేశారు.

- లింగపాలెం, ఆంధ్రజ్యోతి


ధర్మాజీగూడెం పాఠశాలలో యూ ఆకారంలో ఏర్పాటుచేసిన బెంచీలపై విద్యార్థులు


బొర్రంపాలెంలో పర్యటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

పారిశుధ్యంపై కేంద్ర బృందం ఆరా

బొర్రంపాలెంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

టి.నర్సాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఏఎంఎస్) కేంద్ర బృందం సునీల్, రాజేశ్ బొర్రంపాలెంలో మంగళవారం పర్యటించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఉత్తమ గ్రామాలను ఎంపిక చేయడానికి పలు అంశాలపై గ్రామస్థుల అభిప్రాయాలు సేకరించారు. మరుగుదొడ్ల వినియోగం, పంచాయతీ, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, సచివాలయాలు, డ్రెయినేజీ వ్యవస్థ, చెత్త నుంచి సంపద తయారీ, చెత్త తరలింపు, ప్లాస్టిక్ నిషేధం, వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై సమాచారం సేకరించారు. సర్పంచ్ కలపర్తి వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి పగడం నాగేశ్వరరావు, సీపీఆర్‌సీ టీమ్, సచివాయల సిబ్బంది, పాల్గొన్నారు.

నేడు హోం మంత్రి అనిత రాక

చింతలపూడి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గంలో హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు ధర్మాజీగూడెం, 9.30 గంటలకు లింగపాలెం, 10 గంటలకు చింతలపూడి పట్టణం ఆంథోని నగర్‌లో జరిగే సుపరిపాలన తొలి అడుగు ర్యాలీల్లో పాల్గొంటారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మంగళవారం తెలిపింది. ఆంథోని నగర్ నుంచి ఆర్‌కె ఫంక్షన్ హాలు వరకు ర్యాలీగా వచ్చి అక్కడ జరిగే సమావేశంలో పాల్గొంటారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుండి పార్టీ అధ్యక్షులు, గ్రామ కమిటీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని తెలిపారు.

నేడు సీసీఎల్ఏ అదనపు కమిషనర్ రాక

ఏలూరు, జూలై22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భూపరిపాలన శాఖ (సీసీఎల్ఏ) అదనపు కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి బుధవారం జిల్లాలో పర్యటిస్తారు. ఏలూరు రూరల్, భీమడోలు పరిసర మండలాల్లో భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించే అవకాశం ఉంది. ఇళ్లకు కేటాయించిన లేఅవుట్‌లను, ఇతర అంశాలపై ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అనంతరం ఏలూరు కలెక్టరేట్‌లో తహసీల్దార్లతో సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి పాల్గొంటారు. ఈ మేరకు కలెక్టరేట్ వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి విశ్వేశ్వరరావు, సీసీఎల్ఏ అదనపు కమిషనర్ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

భారీ వర్షం


కుక్కునూరులో హోరున కురుస్తున్న వర్షం

ఏలూరు సిటీ/కుక్కునూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి జిల్లాలో మబ్బుల వాతావరణం ఏర్పడింది. సాయంత్రం ఈదురుగాలులతో వర్షం పడింది. పలు ప్రాంతాల్లో స్వల్పంగా, మరి కొన్ని చోట్ల జోరుగా వర్షం కురిసింది. ఈనెల 24న మరో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ వర్షాలు సార్వా పంటల సాగుకు అనుకూలిస్తాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. వర్షాల రాకతో సార్వా వరి, ఇతర పంటల సాగు కొనసాగుతోంది.

కుక్కునూరు మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు వర్షం కురిసింది. 15 రోజులుగా వర్షాలు లేక పత్తిపంట మొక్క దశలోనే ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. తడులు అందక రైతులు వర్షం కోసం ఎదురుచూ స్తూనే ఉన్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలతో పత్తి రైతుల ఆశలు చిగురించాయి. మొక్కలకు పత్తి పంటలో దుక్కులు దున్ని మందులు వేయడానికి రైతాంగం సన్నద్ధమవుతున్నారు. వర్షాలతో పత్తి సాగు కొంత మేర అనుకూలంగా ఉంది.

జిల్లాలో 22.5 మి.మీ. వర్షపాతం

జిల్లాలో గడచిన 24 గంటల్లో సరాసరి వర్షపాతం 22.5 మిల్లీమీటర్లు నమోదైంది. టి.నరసాపురం మండలంలో అత్యధికంగా 60.2 మి.మీ. బుట్టాయగూడెంలో అత్యల్పంగా 3.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. లింగపాలెంలో 53.6, ముసునూరు 52.4, ద్వారకాతిరుమల 40, కామవరపుకోట 38.8, పోలవరం 34, చింతలపూడి 32.2, చాట్రాయి 31.4, భీమడోలులో 24.2, ఆగిరిపల్లి 23.2, మండవల్లి 21.2, కలిదిండి 20.6, కైకలూరు 18.4, జంగారెడ్డిగూడెం 17.2, దెందులూరు 17, ముదినేపల్లి 16.8, ఏలూరు అర్బన్ 16.4, పెదవేగి 16.4, ఉంగుటూరు 16, నూజివీడు 14.6, ఏలూరు రూరల్ 14.2, వేలేరుపాడు 12.2, నిడమర్రు 12.2, పెదపాడు 10.4, కుక్కునూరు 7.2, కొయ్యలగూడెం 5.8, బుట్టాయిగూడెంలో 3.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

ఐఎంపఏ యాప్‌లో తపాలా సేవలు

ఏపీటీ 2.0 సాఫ్ట్‌వేర్‌తో నవశకం

- జిల్లాలోని 257 పోస్టాఫీసులు అనుసంధానం
- ఏలూరులో ప్రారంభించిన ఎస్పీవో శ్రీకర్‌బాబు

ఏలూరు అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ న్యూ జనరేషన్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ పోస్టల్ సేవలను ఖాతాదారులకు అందుబాటులోకి తెచ్చింది. ఏపీటీ 2.0 (అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ)సేవలను జిల్లావ్యాప్తంగా 257 పోస్టాఫీసుల్లో అందుబాటులోకి ఉన్నట్లు తపాలా కార్యాలయాల సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్‌బాబు వెల్లడించారు. స్థానిక హెడ్ పోస్టాఫీసులో ఏపీటీ 2.0 విధానాన్ని జిల్లాలోని అన్ని పోస్టాఫీసులకు అనుసంధానించే సాఫ్ట్‌వేర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం తపాలా సేవలన్నీ నూరుశాతం వెబ్ ఆధారిత క్లౌడ్ టెక్నాలజీలో లభిస్తాయన్నారు. ఏపీటీ 2.0 విధానంలో సైబర్ నేరాలను నియంత్రణ, వాటిపై నిఘా ఉంటాయన్నారు.


ఏపీటీ కౌంటర్ ప్రారంభించిన ఎస్పీవో శ్రీకర్‌బాబు

ఇంటి వద్ద నుంచి పోస్టల్ సేవలు

వినియోగదారులు, ఖాతాదారులు ఏపీటీ సేవలను పొందడానికి మొబైల్‌ఫోన్ల ద్వారా గూగుల్ ప్లేస్టోర్‌లో ఐఎంపఏ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే ఐడీ నంబరు వస్తుందని, ఆ నంబరు ద్వారా రిజిస్టర్ పోస్టు, స్పీడ్ పోస్ట్ తదితర తపాలా సేవలను ఇంటి నుంచే పొందవచ్చన్నారు. పోస్టు చేయదలచిన పార్సిల్ అంచనా బరువు, సమీప పోస్టాఫీసు వివరాలను ఐఎంపఏ యాప్‌లో నమోదుచేస్తే సంబంధిత ప్రాంత పోస్ట్‌మ్యాన్ ఇంటి వద్దకు వచ్చి తీసుకెళతారని వివరించారు. పార్సిల్ చేస్తున్నవాటికి కనీస పోస్టల్ చార్జీలు రూ.500 కాగా పికప్ ఉచితం అన్నారు. అంతకంటే తక్కువైతే కనీస పికప్ చార్జీ వసూలు చేస్తారని తెలిపారు. చార్జీలను వినియోగదారులు నగదు, యూపీఐ చెల్లింపులు చేయవచ్చన్నారు. ఐఎంపఏ యాప్‌ద్వారా ఏ సమయంలోనైనా పార్సిల్ బుక్ చేసుకోవచ్చునని, పికప్ మాత్రం సమీప పోస్టాఫీసు పనివేళల్లో ఉంటుందన్నారు.

ఈ యాప్ నుంచే ఖాతాదారులు తపాలా సుకన్య సమృద్ధి యోజన, కిసాన్ వికాస పత్రాలు, తదితర పొదుపు పథకాల్లో డిపాజిట్ చేసేందుకు కూడా వెసులుబాటు కల్పించినట్టు వెల్లడించారు. భవిష్యత్‌లో ఆదివారం, సెలవు దినాల్లో కూడా తపాలా సేవలందించే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. ప్రైవేటురంగంలో ఇ-కామర్స్ సంస్థల ద్వారా వస్తోన్న వ్యాపార పోటీని ధీటుగా ఎదుర్కొనేందుకు వన్ సిటీ - వన్ డెలివరీ విధానంలో వివిధ ప్రాంతాల నుంచి డెలివరీ నిమిత్తం వచ్చే ఉత్తరాలు, కవర్లను, పార్సిళ్లకోసం ఏలూరులోని 33 పోస్టాఫీసులను అనుసంధానం చేసి ఒకే పాయింట్ ద్వారా అదేరోజు బట్వాడా చేస్తున్నామని వివరించారు. జిల్లావ్యాప్తంగా తపాలాశాఖకువున్న సొంత స్థలాల్లోనే కొత్త పోస్టాఫీసు భవన నిర్మాణాలను చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, కొద్దిరోజుల్లో ధర్మాజీగూడెంలో తపాలా కార్యాలయ భవననిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు శ్రీకర్‌బాబు ప్రకటించారు. పోస్టల్ ఏఎస్పీ డి.శ్రీనివాసరావు, ఐపీపీబీ మేనేజర్ రాజేశ్, హెడ్ పోస్ట్‌మాస్టర్ డి.రంగారావు, ఇన్‌స్పెక్టర్లు డి.శ్రీకాంత్, యు.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు నిర్లక్ష్యం వీడాలి



ఏజెన్సీలో వైరల్ జ్వరాల వ్యాప్తిపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష

ఏలూరు అర్బన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మరణాలు సంభవిస్తే సంబంధిత వైద్యాధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గిరిజన ప్రాంతాల్లో వైరల్ జ్వరాల వ్యాప్తి అధికంగా ఉందని, ఎక్కువగా జ్వరాలు నమోదైన ప్రాంతాలను హాట్ స్పాట్‌లుగా గుర్తించి ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా గుర్తిస్తే బాధితులను ప్రభుత్వాసుపత్రులకు తరలించి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్, మురుగుకాల్వల్లో పిచికారీ చేయించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం, డీసీహెచ్ఎస్ డాక్టర్ సతీష్, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, డీఎంవో డాక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వన్ స్టాప్ సేవలు


వన్‌స్టాప్ సెంటర్ సేవలపై ఆరా తీస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మహిళలకు మానసిక, శారీరక, లైంగిక హింసపై ఒకేచోట అందుబాటులో ఉన్న వన్‌స్టాప్ సెంటర్ సేవలపై అవగాహన పెంపొందించాలని ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు సూచించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ వైద్య, న్యాయ, కౌన్సెలింగ్, పోలీస్ సహాయ సేవలు, తాత్కాలిక ఆశ్రయం వంటి అంశాలపై సమీక్షించారు. కేసు హిస్టరీలను పరిశీలించారు. వన్‌స్టాప్ సెంటర్ ద్వారా 181 మహిళా హెల్ప్‌లైన్‌కు వచ్చే కాల్స్, పోక్సో కేసులు, గృహహింస చట్టంపై కేసులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు తక్షణ స్పందన, చట్టపరమైన సాయం, రక్షణ, మానసిక మద్దతు అందేలా వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది కృషి చేయాలన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, ఎస్ఐ నాగమణి, వన్‌స్టాప్ సెంటర్ ఏవో చుక్కా నిర్మల, పలువురు పాల్గొన్నారు.

జిల్లా సహకార అధికారిగా ఆరిమిల్లి శ్రీనివాస్



ఏలూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా సహకార అధికారిగా భీమవరం డివిజనల్ సహకార అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్ మరోసారి బాధ్యతలు స్వీకరించారు. పూర్తి అదనపు బాధ్యతలతో డీసీవోగా ఆయన ఇటీవల భీమవరం బదిలీ అయ్యారు. ఏలూరు జిల్లా సహకార ఆడిట్ అధికారి వెంకటేశ్వరరావు ఇన్‌ఛార్జి బాధ్యతలను నిర్వహిస్తున్నారు. జిల్లాపై పట్టున్న అధికారిగా శ్రీనివాస్ పేరుండడంతో తిరిగి ఆయనను డీసీవోగా పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

లోపలి పేజీల్లో..
శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే మధుర ఫలాలే!
నూజివీడులో ప్రపంచ మామిడి దినోత్సవం
బల్క్‌గా మూతేశారు..
పెదపాడు బల్క్ మిల్క్ సెంటర్ నిరుపయోగం
కొరవడిన పర్యవేక్షణ.. మూతపడిన గ్రిడ్
బ్యాటరీలు, విలువైన సామగ్రి చోరీ
విస్తృతంగా ఈగల్ టీమ్ తనిఖీలు



కాంతారావుకు 'గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్ట్' అవార్డు



మజ్జి కాంతారావు



అవార్డు పొందిన చిత్రకళా రూపం

ఏలూరు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆయన కుంచె నుంచి వచ్చే ప్రతీ చిత్రంలో జీవ కళ ఉట్టిపడుతుంది. అటువంటి చిత్రాలు వేలల్లో వేసి ఎందరో ప్రముఖులతో శభాష్ అనిపించుకున్నారు. ఎన్నో అవార్డులు సాధించారు. ఏలూరు నగరానికి చెందిన చిత్ర కళాకారుడు మజ్జి సూర్యకాంతారావు తాజాగా గీసిన చిత్రానికి 'గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్ట్' అవార్డును సాధించారు. ఇటీవల క్రియేటివ్ హార్ట్స్ అకాడమి ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆన్లైన్ ద్వారా 'సెల్యూట్ ఇండియన్ సోల్జర్స్ ఆపరేషన్ సిందూర్' అంశంపై దేశవ్యాప్తంగా చిత్రకళ పోటీలు నిర్వహించారు. వేలాది మంది చిత్ర కళాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో సూర్యకాంతారావు గీసిన చిత్రం న్యాయ నిర్ణేతలను అమితంగా ఆకర్షించింది. ఈ మేరకు ఆ చిత్రానికి గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డును ప్రకటించారు. త్వరలో ఈ అవార్డును అందుకోనునానరు. అతడు అవార్డు సాధించడం పట్ల సినీ నిర్మాత అంబికా రాజా, ఏలూరు చిత్ర కళాకారుల సమాఖ్య సభ్యులు, హిందూ యువజన సంఘం వైఎంహెచ్‌ఏ సభ్యులు, రంగస్థల కళాకారులు, నగర ప్రముఖులు అభినందనలు తెలిపారు.



సింగవరంలో తాగునీటి ఫిల్టర్‌బెడ్‌లను పరిశీలిస్తున్న అధికారులు

సింగవరం గ్రామస్థులకు సురక్షిత తాగునీరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దెందులూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సింగవరం గ్రామస్థులు కలుషితమైన తాగునీరు అందిస్తున్నారని వారి ఇబ్బందులపై ఆంధ్రజ్యోతిలో 'తాగునీరు ఇలా ఉంటే తాగేదెలా ?' అనే కథనం మంగళవారం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. మండలంలోని కొత్తగూడెం పంచాయతీ పరిధిలోని సింగవరం గ్రామంలో కలుషిత తాగునీటి సమస్యపై జిల్లా ఎస్ఈ జి.త్రినాథ్‌బాబు, డీఈ డి.రామారావు, ఏఈ చింతమనేని వర్మ సింగవరంలోని ఫిల్టర్‌బెడ్‌లను పరిశీలించారు, స్థానిక టీడీపీ నాయకుడు, బ్యాంకు మాజీ అధ్యక్షుడు పర్వతనేని రామకృష్ణతో కలిసి ఫిల్టర్‌బెడ్‌లలో ఇసుకను మార్పిడి చేసే పనులు ప్రారంభించారు. ప్రస్తుతం గ్రామస్థులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పక్క గ్రామమైన గుండుగొలనుకు చెందిన సురక్షిత తాగునీటి పథకం నుంచి అందించేందుకు చర్యలు తీసుకున్నారు. తాగునీరు అందించేందుకు కృషి చేసిన ఆంధ్రజ్యోతికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



అధికారులు, పిటీషన్‌దారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

ఎవరికీ ఇబ్బంది లేకుండా చూస్తాం

» అజ్జమూరు గ్రామస్థులతో జేసీ రాహుల్ కుమార్

ఆకివీడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఎవరికీ ఇబ్బంది లేకుండా న్యాయం జరిగేలా చూస్తున్నామని పశ్చిమ గోదావరి జిల్లా జేసీ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆకివీడు మండలం అజ్జమూరు మీదుగా వెళుతున్న ఎన్‌హెచ్ 165కు సంబంధించి అభ్యంతరాలు తెలిపిన 44 మంది రైతులతో మంగళవారం ఆకివీడు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జేసీ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామకంఠం పరిధిలో సుమారు 400 మీటర్ల పొడవు ఎగ్జిస్టింగ్ రోడ్ మార్గంలో వెళుతుండడంతో తవ ఇళ్ల స్థలాలు నష్టపోతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు ప్రకటించిన 45 మీటర్ల రోడ్డు వెడల్పు కాకుండా గతంలో ప్రకటించిన మాదిరిగా 30 మీటర్లు వెడల్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. చదరపు గజం ప్రభుత్వ విలువ రూ.5 వేలు చొప్పు లెక్కకడుతున్నారని, అలా అయితే తాము తీవ్రంగా నష్టపోతామన్నారు. గ్రామంలోని శ్మశానం ఆలయాలు కూడా నష్టపోయే ప్రమాదముందని అలా జరగకుండా చూడాలన్నారు. జేసీ మాట్లాడుతూ ప్రాథమిక అంచ నాతో చట్ట ప్రకారం సర్వే చేస్తున్నామని ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తున్నామన్నారు. తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, డీటీ ఫరూఖ్, కలెక్టర్ కార్యాలయ ల్యాండ్ సూపరింటెండెంట్ సీహెచ్ రవికుమార్, డీటీ కళ్యాణి, ఎన్‌హెచ్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ కాజా, సబ్ రిజిస్ట్రార్ పీఎస్వీ లక్ష్మి తదితరులు ఉన్నారు.

పాలకొల్లులో లఘు చలనచిత్ర పోటీలు



మాట్లాడుతున్న చేగొండి హరిరామ జోగయ్య, ముత్యాల శ్రీనివాస్ తదితరులు

పాలకొల్లు రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి) :జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఆగస్టు నెలాఖారు లేదా సెప్టెంబరులో పాలకొల్లులో అంతర్జాతీయ లఘు చలనచిత్ర పోటీలను నిర్వహిస్తున్నట్టు సారస్వత పరిషత్ గౌరవ సలహాదారు చేగొండి వెంకట హరిరామజోగయ్య, అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సినీ డైరెక్టర్ రాజా వన్నెంరెడ్డి, గుడాల హరిబాబు తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ పోటీలకు పంపే ఎంట్రీల నిడివి 15 నిమిషాలకు తక్కువ మాత్రమే ఉండా లన్నారు. ఎంట్రీలను ఆగస్టు 25వ తేదీలోగా సూచించిన చిరునామాకు పంపా లన్నారు. వచ్చిన చిత్రాలలో జ్యూరీ సభ్యులు 15 లేక 12 చిత్రాలను ఎంపిక చేసి సెప్టెంబరు మొదటి ఆదివారంలో వాటిని ప్రదర్శిస్తారన్నారు. ప్రదర్శించిన ప్రతీ చిత్రానికి రూ.5వేలు బహుమతి, ప్రశంసాపత్రం ఉంటుందన్నారు. ఉత్తమ చిత్రానికి రూ.లక్ష బహుమతి, ద్వితీయ ఉత్తమ చిత్రానికి రూ.75వేలు బహు మతి, తృతీయ చిత్రానికి రూ.50వేలు బహుమతి ఉంటుందన్నారు. లఘు చిత్రాల పెన్ డ్రైవ్‌లను పంపాల్సిన చిరునామా ముత్యాల శ్రీనివాస్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన, మావుళ్లమ్మ పేట, పాలకొల్లు-534260, 92914 64646, 90007 34466, 99492 49699, 90304 64646 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

మావుళ్లమ్మకు రూ.లక్ష, 8 గ్రాముల బంగారం అందజేత



అమ్మవారికి నగదు, బంగారం అందిస్తున్న దాత

భీమవరంటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి):మావుళ్లమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన ఎ.సాయి సహస్ర లక్ష రూపాయలను శాశ్వత నిత్యాన్నదానంకు, అమ్మవారి స్వర్ణ వస్త్ర నిధికి 8 గ్రాముల బంగారం విరాళంగా అందజేశారు. మంగళవారం ఆలయానికి వచ్చిన దాతలు ముందుగా అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. దాతలకు దేవస్థానం తరపున ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం ఫొటో ప్రసాదాలు అందించారు.

శ్రీవారి క్షేత్రంలో పచ్చదనం

» త్వరలో గ్రీన్‌సిటీగా చిన్నతిరుపతి

సందర్శకులకు ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదానికి అధిక ప్రాధాన్యం

నిత్యజీవితంలో మనం ఎన్నో ఒత్తిళ్లకు, ఉద్రిక్తలకు గురతుంటాం. ఆ సమయంలో వాటి నుంచి మన మనసును మళ్లించేందుకు ఏదైనా ఒక పుణ్య క్షేత్రానికో లేదా ఆహ్లాదాన్నిచ్చే ప్రదేశానికో వెళ్లాలని చూస్తుంటాం. అక్కడకు వెళ్లి దైవ దర్శనం, ఆ తరువాత శిల్ప సౌందర్యాలు, పచ్చదనాన్ని చూసి పరవశించిపోతాం. ఆహ్లాదకరమైన వాతావరణం వల్ల టెన్షన్లకు, ఒత్తిళ్లకు తాత్కాలికంగా బైబై చెప్పేస్తాం.. ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటాం.. ఈ విధంగా ద్వారకాతిరుమల క్షేత్రానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదాన్ని పంచేందుకు అధికారులు అనేక ఉద్యానవనాలు, పచ్చికబయిళ్లు ఏర్పాటుచేసి. శ్రీవారి క్షేత్రాన్ని గ్రీన్‌సిటీగా మార్చేందుకు తీసుకున్న చర్యలు ఊపందుకున్నాయి. ఇందుకు పలువురు దాతలు భాగస్వామ్యులవుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



శ్రీవారి క్షేత్రంలో పచ్చదనంతో గోవింద నామం..

ద్వారకాతిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్షేత్రమైన ద్వారకాతిరుమలకు వచ్చిన భక్తులకు పచ్చదనం కనువిందు చేస్తోంది. క్షేత్రంలో అడుగెట్టే వారికి లక్ష్మీపురం ఆలయం నుంచి ప్రధాన ఆలయం వరకు అడుగడుగునా పచ్చదనం పరవళ్లు తొక్కుతోంది. ఈ క్రమంలో డివైడర్‌ల మధ్యలో ఇతర క్రోటన్‌తో పాటు ఎంతో ఖరీదైన ఫాక్స్‌టైల్ పామ్ మొక్కలను వేశారు. ఇవి ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. సెంట్రల్ పార్కింగ్ వద్ద విజయవాడకు చెందిన వరుణ్ గ్రూప్ సంస్థ కంపెనీకి చెందిన దాత సుమారు రూ.5లక్షలు విలువైన గరుడపక్షి దాని చుట్టూ అవెన్యూ ప్లాంటేషన్‌ను ఏర్పాటు చేయడంతో వీక్షించే భక్తులు పరవశిస్తున్నారు.

శ్రీవారి జంట గోపురాల వద్ద, కొండపైనున్న పలు అతిథి గృహాల ముందు ఏనుగు ఆకారంలో క్రోటన్‌ను పెంచుతు న్నామన్నారు. శ్రీనివాస చరిత్రను తెలిపేలా నమూనా దాని చుట్టూ పచ్చదనాన్ని పెంపొందించారు. మాల్ఫీజియా జాతి క్రోటన్‌తో నిర్మించిన గోవిందా.. గోవింద అను పేర్లు భక్తులను ఆకర్షిస్తున్నాయి.



సెంట్రల్ పార్కింగ్ వద్ద గరుడ పక్షి పచ్చదనం..

టోల్‌గేట్ సమీపంలో దాదాపు రెండు ఎకరాల విస్తీర్ణంలో మాధవకుంట వరకు జపనీస్ హార్టికల్చర్ ప్రాసెస్‌ను అనుసరించి మియావాకీ ఫారెస్ట్ మెథడ్‌తో పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు దేవస్థానం ఈఈ డీవీ భాస్కర్, డీఈ టి.సూర్యనారా యణ ఆంధ్రజ్యోతికి తెలిపారు. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు పెరిగి డీప్ ఫారెస్ట్‌గా ఇవి కనిపిస్తాయి. రెండు అడుగుల వరకు ఎదిగిన తర్వాత భూమిలోని వేర్లు కలవడంతో మొక్కలు పైకి సమష్టిగా పెరిగి ఫారెస్ట్‌లా ఉంటుందని తెలిపారు. దాదాపు ఐదు వేల మొక్కలు వేస్తున్నామని వివరించారు. ఈ మొక్కలు పెరిగితే పక్షులకు, ఇతర ప్రాణులకు ఆవాసాలుగా ఉంటాయి.

ఈక్రమంలో గుమ్మడి టేకు, సీమతంగేడు, బాదం, వేప, వేగిస, మర్రి, మారేడు, నల్లేరు, నేరేడు, చింత, జామ, వెలగ, ఉసిరి, ఆకాశమల్లి, చిన్న అశోక, ఔషధ మొక్కలైన బ్రహ్మి, మండూకపర్ణి, వట్టివేరు. పసుపు, అల్లం, నిమ్మగడ్డి వంటి పలు మొక్కలను వేస్తామన్నారు. ఇంకా పలు రకాలు త్వరలో వస్తాయని వివరించారు. సాధారణంగా మార్జిన్‌లో వేసే దొరంతా క్రోటన్‌కు బదులుగా ఎక్కడా లేని విధంగా 'రాణి చిన్నమ్మారావు సత్రం, వేదపాఠశాల' తదితర ప్రాంతాల్లో కరివేపాకు మొక్కలను వేశామ న్నారు. దీనివల్ల సువాసనతో పాటు గ్రీనరీగా ఉంటుందన్నారు. ఈ మొక్కలను కటింగ్ చేసినప్పుడు వంటకాల్లోకి ఉపయోగపడతాయి.



లక్ష్మీపురం ఆలయం నుంచి ద్వారకాతిరుమల వరకు డివైడర్‌లో ఖరీదైన ఫాక్స్‌టైల్ పామ్ మొక్కలు



ఆకర్షణగా పచ్చదనం నడుమ శ్రీనివాస చరిత్ర

కలశం ఆకారంలో క్రోటన్

కొండపై అతిథిగృహం ముందు గ్రీన్ ఎలిఫెంట్

ఈనెలాఖరుకు పదివేల మొక్కలు నాటుతాం



శ్రీవారి క్షేత్రాన్ని ఫ్రూట్, ఫ్లవరింగ్, పచ్చదనంతో సుందరీకరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. భక్తుల సౌకర్యాల కల్పనతో పాటు వారికి ఆహ్లాదం కల్గించేలా ఎన్నో ఏర్పాట్లు చేస్తున్నాం.. ఇప్పటికి క్షేత్రంలో నాలుగు వేల మొక్కలు నాటాం. ఈనెలాఖరుకు పదివేలు నాటి లక్ష్యాన్ని చేరుకుంటాం. దేవస్థానం చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు నేతృత్వంలో అధికారులు పనిచేస్తున్నారు.

- ఎన్‌వీ సత్యనారాయణమూర్తి
ఈవో, ద్వారకాతిరుమల దేవస్థానం

ఉద్యాన పంటలకు రాయితీలు

పెదవేగి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగు రైతులను ఆదుకోవడానికి అనువుగా ప్రభుత్వం రాయితీలను అందిస్తోంది. నిమ్మ, కొబ్బరి, కోకో, మామిడి, జీడి మామిడి, తైవాన్ జామ, టిష్యూకల్చర్ అరటి, బొప్పాయి, హైబ్రిడ్ కూరగాయల సాగు, ప్లాస్టిక్ మల్చింగ్, పూలసాగు శాశ్వత పందిళ్ల వంటి పంటల సాగు, ఉద్యాన పంటల విస్తరణ పథకంలో భాగంగా సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ ద్వారా ప్రభుత్వం రాయితీలను అందిస్తోంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..



ప్రభుత్వ రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని పంటల సాగును చేపట్టాల. హెక్టారు యూనిట్‌గా ప్రభుత్వం రాయితీలను అందిస్తుందని, ఆసక్తి కలిగిన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, పంటలసాగు చేపట్టాలి.

- ఎం.రత్నమాల
పెదవేగి మండల ఉద్యానశాఖాధికారిణి

పంట	మొక్కల మధ్య దూరం (అడుగులు)	మొక్కల సంఖ్య	మొదటి ఏడాది రాయితీ (రూ.)	రెండో ఏడాది రాయితీ (రూ.)	మొత్తం రాయితీ (రూ.)
మామిడి	7.5x7.5	178	30వేలు	20వేలు	50వేలు
తైవాన్‌జామ	3x3	1,111	48వేలు	32వేలు	80వేలు
నిమ్మ	6x6	278	30వేలు	20వేలు	50వేలు
జీడిమామిడి	7x7	200	18వేలు	12వేలు	30వేలు
కోకో	2.75x3	500	18వేలు	12వేలు	30వేలు
టిష్యూకల్చర్ అరటి	1.8x1.8	3086	42వేలు	28వేలు	70వేలు
బొప్పాయి	1.8x1.8	3086	18వేలు	12వేలు	30వేలు
కొబ్బరి	8x8	150	3,200	3,200	6,400
హైబ్రిడ్ కూరగాయలు					24వేలు
విడి పువ్వులసాగు					20వేలు
ప్లాస్టిక్ మల్చింగ్					20వేలు
శాశ్వత పందిళ్ల					2.50లక్షలు



అంతర పంటలతో అధిక ఆదాయం

» తక్కువ పెట్టుబడితో రైతులకు రెండు రకాల ఆదాయం » స్వల్ప వ్యవధిలోనే చేతికి పంట

దెందులూరు,జూలై 22(ఆంధ్రజ్యోతి): దేశానికి అన్నం పెట్టే రైతు నష్టాల నుంచి బయట పడేందుకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవడానికి ప్రస్తుత పరిస్థితుల్లో అనేక పద్ధతులను రైతులు అవలంబిస్తున్నారు. రైతులకు పెరిగిన పెట్టుబడుల దృష్ట్యా సేద్యం చాలా కష్ట సాధ్యమైంది. సాధారణ పంటకు తోడు మధ్య ఆదాయ మార్గంగా అంతర పంటలపై రైతులు పెద్దఎత్తున ఆసక్తి చూపిస్తున్నారు. వాణిజ్య పంటలైనా కొబ్బరి, కోకో, అరటి పంటల్లో అంతర పంటలుగా పలు రకాల కూరగాయలు, పూల సాగు చేపట్టి రైతులు అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. వాణిజ్య పంటల రైతులు మార్కెట్‌లో ఫలసాయం అందే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో పంట లను కోల్పోవడం. లేకపోతే గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఈ అంతర పంటలు ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. దెందులూరు నియోజకవర్గంలోని దెందులూరు, పెదపాడు, పేదవేగి, ఏలూరు రూరల్ మండలాల్లో సుమారు 3,900 ఎకరాల్లో అంతర పంటలు సాగు చేస్తున్నారు.

- అధికంగా పేదవేగి మండలం లక్ష్మీపురం, కూచింపూడి, న్యాయంపల్లి, పెదవేగి, దెందులూరు మండలంలో గోపన్నపాలెం, చల్లచింతలపూడి, మేదినరావుపాలెం, రామారావుగూడెం, విజయరాయి, బాపిరాజుగూడెం, వేగివాడ, శ్రీరామరం, పెదవేగి గ్రామాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. వాణిజ్య పంటలైనా అరటి, కంద, కొబ్బరి, పసుపు, జామ, బెండ, బంతి, మిరప, ఆకుకూరలు, వంగ, కాకర, వంటి పంటలతో పాటు పూల సాగును అంతర పంటలుగా రైతులు సాగు చేస్తున్నారు.

అంతర పంటలతో భూసారం పెంపు



అంతర పంటలతో భూములకు, రైతులకు ఎంతో మేలు. ఈ పంటల వల్ల పంటల్లో వచ్చే తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుంది. దీనికి కారణం పూల సాగుతో అక్కడకు వచ్చే మేలు చేసే మిత్ర పురుగులు క్రిమికీటకాలను ఆహారంగా తీసుకుంటాయి. పంట మార్పిడి వల్ల వచ్చే పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుంది.

- ఎల్.నరసింహరాజు, ఏవో, దెందులూరు మండలం



నానో యూరియా, నానో డీఏపీ నానో ఎరువులను రైతులకు చేపిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి (ఫైల్)

నానో ఎరువులే మేలు

» ఖర్చు తక్కువ.. పంట పొలాలకు సులువుగా తీసుకెళ్లొచ్చు

లింగపాలెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు పలకరించడంతో రాష్ట్రంలో రైతులు పంటలు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. లక్షలాది మంది రైతులు తమ పంట పొలాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కంది, పెసర, మినుము పలు రకాల పంటలను పండిస్తూ వాటిలో అధిక దిగుబడులు సాధించేందుకు అనేక రకాల రసాయన ఎరువులను కొనుగోలు చేస్తూ పంటలకు వాడుతున్నారు. ఈ ఎరువులు యాభై కేజీల బస్తాలలో ఉండడంతో వాటిని దూరప్రాంతాల్లోని పంట పొలాల్లోకి తీసుకువెళ్లేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎరువులను తరలించేందుకు వాహనాలు, కూలీలపై ఆధార పడవలసి రావడంతో ఖర్చు తడిసి మోపెడవుతుంది. ఎరువులు చల్లిన తరువాత నీటితడులు ఎక్కువైనా, అందకపోయినా చల్లిన ఎరువంతా వృథా అవుతుంది. వీటి ధరలు విపరీతంగా పెరిగాయి.

ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం.. రైతులు రసాయన ఎరువులను పరిమితంగా వాడడంతో పాటు ఎరువులను పంటపొలాలకు సులువుగా తరలించేందుకు వీలుగా ఉండే నానో యూరియా, నానో డీఏపీలను వినియోగంచేలా ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచింది. చాలామంది రైతులకు అవగాహన లేకపోవడంతో ఎరువుల దుకాణాల వద్దకు వెళ్లి బస్తాలలో ఎరువులు కావాలని అడుగుతున్నారు. బస్తాలను మోసేపని తగ్గుతుందని సూచించినా అవగాహన లేకపోవడంతో వీటిని తీసుకెళ్లేందుకు జంకుతున్నారు. కొద్దికాలంగా నానో ఎరువులను వినియోగంచడం వల్ల కలిగే లాభాలపై వ్యవసాయశాఖ రైతులకు అవగాహన కల్పిస్తుండడంతో కొందరు రైతులు ఇప్పుడిప్పుడే నానో ఎరువులను వాడేందుకు ఆసిక్తి చూపుతున్నారు.

ప్రయోజనాలు ఇలా..

మార్కెట్‌లో యాభై కేజీల యూరియా బస్తా ధర రూ.266, డీఏపీ యాభై కేజీల బస్తా ధర రూ.1,350 ఉండగా కొందరు వ్యాపారులు యూరియా రూ.350, డీఏపీ రూ.1400కు అనధికారంగా అమ్ముతున్నారు. వీటిని పంట పొలాల వద్దకు చేర్చేందుకు అదనంగా మరో వంద రూపాయల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నానో యూరియా 500 మిల్లీలీటర్లు ధర రూ.225, నానో డీఏపీ ధర రూ.600 మాత్రమే ఉండడమే కాకుండా తీసుకువెళ్లేందుకు వీలుగా ఉంటుందని ఎకరానికి రెండు సార్లు పిచికారీ చేసుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

నానో ఎరువులపై అవగాహన కల్పిస్తున్నాం



నానో ఎరువుల వాడకం వల్ల రైతులకు ఆర్థిక భారంతో పాటు శారీరక శ్రమ తగ్గుతుంది. చాలామంది రైతులు నానో ఎరువుల వినియోగించడం వల్ల లాభాలు తెలియక బస్తాలలో ఎరువులనే కొనుగోలు చేస్తున్నారు. రైతులు వీటిని వినియోగించేలా వారికి అవగాహన కల్పిస్తున్నాం. మండలంలో రైతులకు సరిపడా నానో యూరియా, నానో డీఏపీ నిల్వలున్నాయి.

- వి.ప్రదీప్‌కుమార్, ఏవో, లింగపాలెం

'విద్యతోపాటు చట్టాలపై అవగాహన అవసరం'



సదస్సులో మాట్లాడుతున్న వన్‌టౌన్ ఎస్ఐ నాగబాబు

ఏలూరు క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటు చట్టపరమైన పరిజ్ఞానాన్ని తెలుసుకుని.. సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని ఏలూరు వన్‌టౌన్ ఎస్ఐ బి. నాగబాబు సూచించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగబాబు తన సిబ్బందితో ఏలూరు కస్తూరిబా గర్ల్స్ హైస్కూలులో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాలికల రక్షణ కోసం పోక్సో చట్టాన్ని రూపొందించారని ఈ చట్టంపై అవగాహన కల్పించుకుని.. ఏమైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనప్పుడు తల్లిదండ్రులకు గాని ఉపాధ్యాయులకు గాని తెలియజేయాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించుకోవాలన్నారు. సోషల్ మీడియా వేదికగా సైబర్ నేరగాళ్ల అనేక మోసాలకు పాల్పడుతున్నారని వీటిపై అవగాహన పెంచుకుని తమ కుటుంబ సభ్యులతోపాటు చుట్టు పక్కల వారికి అవగాహన కల్పించాలన్నారు. మహిళలు, బాలిక రక్షణ కోసం పోలీస్ శాఖ శక్తియాప్‌ను రూపొందించారని ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అత్యవసర పరిస్థితుల్లో ఆ యాప్ నుంచి 112కు కాల్ చేయాలని లేదా ఎస్‌వోఎస్ బటన్ నొక్కగానే పది నిమిషాల్లోపు పోలీసులు అక్కడకు చేరుకుంటారని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే మధుర ఫలాలే!

» నూజివీడులో ప్రపంచ మామిడి దినోత్సవం

నూజివీడు, జూలై 22(ఆంధ్రజ్యోతి):ప్రపంచ మామిడి దినోత్సవం సందర్భంగా నూజివీడు మామిడి పరిశోధన కేంద్రంలో మామిడి రైతులతో ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఉద్యానవన శాఖ అధికారులు మామిడి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులను వివరించారు. నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం ముఖ్య అధికారి డాక్టర్ బీకేఎం లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏలూరు జిల్లా ఉద్యానవనశాఖ అధికారి డాక్టర్ ఎస్.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మామిడిలో కొమ్మ కత్తిరింపులు, ఎరువుల నిర్వహణపై సూచనలిచ్చారు. వీటి నిర్వహణకు హెక్టార్‌కు రూ.20 వేల ప్రభుత్వ రాయితీ ఉందని, ప్రతి గ్రామంలో రైతు సేవా కేంద్ర పరిధిలో ఇద్దరు లేక ముగ్గురు ఆదర్శ రైతులను ఎంపిక చేసి శాస్త్రవేత్తలు తెలిపిన సూచనలు, యాజమాన్య పద్ధతులు క్షేత్రస్థాయిలో రైతులు పాటించేలా చూడాలని అధికారులకు తెలిపారు. మామిడిలో ముందస్తు పూత రావడానికి సరైన యాజమాన్య పద్ధతులు చేపట్టడం ప్రభుత్వం ద్వారా అందే రాయితీలను ఆయన వివరించారు. ఎన్టీఆర్ జిల్లా ఉద్యానవనశాఖ అధికారి పి.బాలాజీకుమార్ మాట్లాడుతూ రెడ్డిగూడెం మండలంలో మామిడి రైతులు సంఘటితమై పెట్టుబడులు తగ్గించుకొని నాణ్యమైన పురుగుమందులు ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో వాడుకొని లాభాలు పొందిన విధానాన్ని రైతులకు వివరించారు. నూజివీడు మామిడి కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. చెట్టుకు సరిపడా గాలి వెలుతురు వచ్చేలా కొమ్మ కత్తిరింపులు ఉండాలని సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రాధా రాణి, జీఎస్ రాజు తదితరులు మామిడి పంటపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రైతుల సందేహాలకు సమాధానాలిచ్చారు.





సభలో సూచనలు అందిస్తున్న మామిడి శాస్త్రవేత్తలు.. పాల్గొన్న రైతులు



పేరుపాలెంలో ఎగసిపడుతున్న సముద్ర అలలు

వదలని వరుణుడు

బుధవారం నుంచి మూడు రోజుల పాటు బీచ్‌కు, వేటకు అనుమతి లేదు : తహసీల్దార్, ఎస్‌ఐ

మొగల్తూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు 44.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా రెండు రోజులుగా చెదురుమదురుగా జల్లులు పడుతున్నాయి. రాత్రి సమయాల్లో పిడుగులు, ఈదురు గాలులతో వర్షాలు కురుస్తుండడంతో రాబోయే మూడు రోజులు పాటు బీచ్‌కు అనుమతించడం లేదని తహసీల్దార్ కె.రాజ్‌కిషోర్, ఎస్‌ఐ వాసు తెలిపారు. బలమైన గాలులు వీస్తున్నందున మరో మూడు రోజులు పాటు మత్స్యకారులు సముద్ర వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈనెల 24న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సార్వా సాగు పనులు ప్రారంభించేందుకు విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు సాగు పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

తాగునీటి పథకాలకు రూ.250 కోట్లతో ప్రణాళికలు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తణుకు నియోజకవర్గంలోని తాగునీటి పథకాలకు రూ.250 కోట్లు జల జీవన్ మిషన్ పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో గ్రామీణ, మంచినీటి సరఫరా, పారిశుధ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి పథకాలను తక్షణమే ప్రారంభించాలన్నారు. జలజీవన్ మిషన్ గ్రాంటులో వాటర్ గ్రిడ్ పనులకు రూ.1400 కోట్లు అంచనా వేయగా సుమారు రూ.250 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అత్తిలి మండలంలో రూ.4.50 కోట్లు, ఇరగవరం మండలంలో రూ.49 లక్షలతో పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో రూ.3.56 కోట్ల నిధులతో సీసీ, డ్రెయినేజీ నిర్మాణ పనులకు అంచనాలు తయారు చేయాలన్నారు. జిల్లా పరిషత్ నిధులు రూ.కోటి వ్యయంతో పనులు ప్రారంభించాలని వివరించారు. సమావేశంలో డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు



హోటల్‌లో నూనె నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని ఓ రెస్టారెంట్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కె.వెంకటరత్నం బృందం ఈ తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ఆహార నాణ్యతపై పలు ఆరోపణలు రావడంతో అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కుళ్లిన కూరగాయలు గుర్తించడంతోపాటు నిషేధించిన ప్లాస్టిక్ ఉపయోగిస్తుండడంతో రూ.5వేలు జరిమానా విధించారు. హోటల్ యాజమాన్యానికి ఆహార పదార్థాలు నాణ్యత చూపించాలని నోటీసులు జారీ చేశారు. ఈ దాడిలో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏషియన్ స్కేటింగ్‌కు జెస్సీరాజు పయనం



స్కేటింగ్ పోటీలకు పయనమైవుతున్న జెస్సీరాజు

దెందులూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడాకారిణి, దెందులూరు మండలం జోగన్నపాలెంకు చెందిన మాత్రపు సురేష్ కుమార్తె జెస్సీరాజు సౌత్‌కొరియాలో జరిగే ఏషియన్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైంది. ఈ మేరకు టోర్నీలో ఏపీ జట్టు నుంచి తొమ్మిది మంది ఎంపిక కాగా జెస్సీ ఒకరు కావడం గమనార్హం. ప్రతి రెండేళ్లకొకసారి జరిగే ఏషియన్ చాంపియన్‌షిప్‌లో ఆమె సత్తాచాటి పతకంతో తిరిగి రావాలని పలువురు క్రీడాభిమానులు ఆకాంక్షించారు. ఇప్పటికే పలు పతకాలతో సత్తాచాటిన ఆమె భారత ప్రధాని మోదీ పురస్కారం కూడా సాధించింది.

27న సప్త మాత్రుకా దర్శనానికి ప్రత్యేక బస్సులు

» ఏలూరు డీపీటీవో షేక్ షబ్నం

ఏలూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి):శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ ఏలూరు జిల్లా పరిధిలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపో నుంచి ఈనెల 27న ఆదివారం సప్తమాతృకా దర్శనం కోసం ప్రత్యేక లగ్జరీ బస్సులు ఉదయం 4.30 గంటలకు బయలుదేరుతుందని ఏలూరు జిల్లా ప్రజారవాణా అధికారి షేక్ షబ్నం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొల్లేటికోట పెద్దింటమ్మ, భీమవరం మావుళమ్మ, పెనుగొండ వాసవీమాత, నిడదవోలు కోట సత్తెమ్మ, పెద్దాపురం మరిడమ్మ, పిఠాపురం పురుహూతికా మాత, ద్రాక్షారామం దాక్షాయిని ఆలయాలను దర్శించిన తర్వాత తిరిగి గమ్యస్థానానికి చేరుతుందన్నారు. టిక్కెట్ ధర రూ.800 మాత్రమే నన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్లు సౌకర్యం ఉందని, టిక్కెట్లు కావాల్సిన వారు 93467 67670, 63038 59484 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఒకే ఊరు నుంచి 36 మంది ఉంటే ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామని ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు

ఏలూరు అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్వోదయ మండలి ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. 'గాంధీజీ ఆశించిన సురాజ్యం- నేటి పరిస్థితులు' అనే అంశంపై తెలుగులో రెండు పేజీలకు మించకుండా హెచ్‌ఎం/ప్రిన్సిపాల్ ధ్రువీకరించిన రచనలను ఆగస్టు 9వ తేదీలోగా కార్యదర్శి, జిల్లా సర్వోదయమండలి, గాంధీ కస్తూరిబా భవనం, శ్రీరాంపురం, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా చిరునామాకు పోస్టులో పంపాలని సూచించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో ఉత్తమ రచనలకు బహుమతులను అందజేస్తామన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు సూచన

ఏలూరు అర్బన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): గతేడాది డిసెంబరు 8న జరిగిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు ఉపకార వేతనాన్ని పొందేందుకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో ఆగస్టు 31లోగా తప్పనిసరిగా నమోదుచేసుకోవాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఇప్పటికే ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనం పొందుతూ ఈ ఏడాది 10,11,12 తరగతులు ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాలయాల్లో డే స్కాలర్లుగా చదువుతున్న విద్యార్థులు కూడా తాజాగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన బ్యాంకు ఖాతాను ఆధార్ నంబరుకు లింకు చేయించుకుని డీబీటీ విధానంలో నగదు జమ అయ్యేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వసతి గృహాల్లో వున్న విద్యార్థులకు ఈ పథకం వర్తించబోదని స్పష్టం చేశారు.



పెదపాడులో నిరుపయోగంగా పాల శీతలీకరణ భవనం

పెదపాడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పెదపాడులోని గోదావరి మిల్క్ గ్రిడ్‌కు మండల సమాఖ్య ఆధ్వర్యంలోని సెల్ఫ్ హెల్ప్ గ్రూపు (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు పాల సేకరణ, శీతలీకరణ, డెయిరీకి తరలింపు పనులు చేసేవారు. దీంతో చుట్టుపక్కల పాడి రైతులంతా మిల్క్‌గ్రిడ్‌కు తమ పాలను విక్రయించేవారు. అయితే మిల్క్‌గ్రిడ్ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షణ కొరవడింది. దీంతో రైతుల నుంచి పాల సేకరణ రోజురోజుకూ తగ్గిపోయింది. నిర్వహణ, కరెంటు ఛార్జీలు, సిబ్బంది వేతనాలు చెల్లింపు భారంగా మారిపోయింది. దీంతో నాలుగేళ్ల వ్యవధిలోనే 2015 మే నెలలో గోదావరి మిల్క్ ద్వారా పాల సేకరణ నిలిచిపోయింది. దీంతో పాలసేకరణ కేంద్రాన్ని తెరిచి పాల సేకరణను ప్రారంభించాలంటూ స్థానిక పాడి రైతులు ఆందోళనలు చేసి అధికారులకు మొర పెట్టుకోవడంతో మిల్క్‌గ్రిడ్‌ను పునరుద్ధరించి పాల సేకరణ ప్రారంభించి మరలా కొద్దిరోజులకే తిరిగి మూసివేశారు. ఆ తరువాత మిల్క్‌గ్రిడ్‌ను అధికారులు పట్టించుకోక పోవడంతో పూర్తిస్థాయిలో మూతపడింది.

పాలసేకరణ ద్వారా పాడి రైతులకు ఆర్థికంగా చేయూతనందించే ఉద్దేశంతో పెదపాడు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో పక్కా భవనాన్ని నిర్మించి అందులో 2011లో సుమారు రూ.50 లక్షల వ్యయంతో గోదావరి మిల్క్‌గ్రిడ్‌ను ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ రైతుల నుంచి సేకరించిన పాలను నిల్వ చేసేందుకు బల్క్ మిల్క్ ట్యాంకులు, పాల శీతలీకరణ యంత్రాలు, టెస్టింగ్ కిట్‌లు, విద్యుత్ సరఫరా లేనప్పుడు ప్రత్యామ్నాయంగా జనరేటర్, బ్యాటరీలను ఏర్పాటు చేశారు. మిల్క్‌గ్రిడ్ ప్రారంభమైన తరువాత పాల సేకరణ, నిర్వహణ, అమ్మకాలు మండల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. పాడిరైతులకు మంచి ధర లభించడంతో పాటుగా నగదు చెల్లింపులు జరిగేవి. అయితే అధికారుల పర్యవేక్షణ కరువై మూతపడింది.

బల్క్‌గా మూతేశారు..

- నిరుపయోగంగా బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్
- కొరవడిన పర్యవేక్షణ.. మూతపడిన గ్రిడ్
- బ్యాటరీలు, విలువైన సామగ్రి చోరీ
- పదేళ్లుగా వినియోగంలో లేక భవనం శిథిలం
- వినియోగంలోకి తేవాలంటూ స్థానికుల డిమాండ్

దొంగలపాలైన విలువైన వస్తువులు..

పాలసేకరణ కేంద్రం మూత పడటం, కార్యాలయం వద్ద భద్రత లేకపోవడంతో భవనానికి వున్న ఇనుప గ్రిల్స్‌ను తొలగించి లోపల వున్న బ్యాటరీలతో సహా తీసుకెళ్లడానికి వీలైన విలువైన వస్తువులను ఆగంతుకులు దొంగిలించారు. పాలసేకరణ కేంద్రంలో దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించిన అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పట్లోనే ఫిర్యాదు చేశారు. విచారణ ఏ స్థితిలో ఉందో తెలియాల్సి ఉంది.

పాడైన యంత్ర సామగ్రి

పదేళ్లుగా ప్లాంట్ మూతపడటంతో ప్లాంట్‌లోని లక్షలాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన మిల్క్ కూలింగ్ యంత్రాలు, జనరేటర్, ఇతర సామగ్రిలో కొన్ని పాడైపోగా, మరికొన్ని నిరుపయోగంగా మారాయి. అయితే కూలింగ్ యంత్రాలు, ట్యాంకులు, ఇతర సామగ్రిని మరో ప్రాంతానికి తరలించినట్లు స్థానిక అధికారులు చెబుతున్నా వాటి వివరాలు, విలువపై పూర్తి స్పష్టత లేదు. మరమ్మతులు లేక భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయిందనే విమర్శలు పెద్దఎత్తున విన్పిస్తున్నాయి. ప్రభుత్వం పాడి రైతుల నుంచి పెద్దఎత్తున పాలసేకరణ కోసం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో పాడి అభివృద్ధి, పాల రైతుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని మూతపడిన బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాన్ని తిరిగి వినియోగంలోకి తేవాలని పాడిరైతులతో పాటుగా ప్రజలు కోరుతున్నారు.

మాతాశిశు మరణాలు నివారించాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి

భీమవరం టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇక మీదట మాతా శిశు మరణాలు జరగకుండా క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టాలని పశ్చిమగోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ జి. గీతాబాయి ఆదేశించారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో మాతా శిశు మరణాలపై సబ్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించగా ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ నెలలో జరిగిన మాతృ మరణం, గత నెలలో జరిగిన అయిదు శిశు మరణాలపై చర్చించారు. మాతాశిశు సంరక్షణ సేవలు బలోపేతం చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. డీసీహెచ్‌ఎస్ డా.సూర్యనారాయణ, గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవీ కళ్యాణి, చిన్న పిల్లలు వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఫాక్సీ ప్రతినిధి డాక్టర్ నరసవాణి, డాక్టర్ పద్మావతి, డీపీహెచ్‌ఎన్‌ఓ వెంకట రత్నం రక్తనిధి నిల్వ అధికారి, సంబంధిత వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆబోతుకు చికిత్స



భీమవరం టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉండి రోడ్డు ప్రాంతంలోని ఒక ఆబోతుకు ఏడాది కాలంగా దాని మెడకున్న తాడు బిగిసి గంగడోలు మొత్తం కట్ అయిపోతోందని గో సంరక్షణ అధ్యక్షుడు సుంకరదాసు తెలిపారు. మంగళవారం తన మిత్రులతో కలసి ఆబోతుని పట్టుకుని చికిత్సకు తరలించామని, భీమవరం పశు ఆసుపత్రి వైద్యులు ప్రథమ చికిత్స చేశారని వివరించారు. లక్ష్మీపతి రాజు, రామకృష్ణరాజు, సీతారామరాజు, నాగేంద్ర సహకారంతో ఆబోతును రక్షించామని సుంకరదాసు తెలిపారు.

జాతీయ జెండాను చూస్తే హృదయం ఉప్పొంగుతుంది



జాతీయ జెండాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మన జాతీయ జెండాను చూస్తే హృదయం ఉప్పొంగుతుందని వక్తలు అన్నారు. భీమవరం క్విట్ ఇండియా స్తూపం వద్ద మంగళవారం శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జాతీయ జెండా స్వీకరణ దినోత్సవాన్ని నిర్వహించారు. భీమవరం పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. సత్యనారాయణ రాజు, ఎన్‌సీసీ మేజర్ డా. ఎ. వీరయ్య, అరసవల్లి సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని ప్రతి బింబింపజేసే త్రివర్ణ పతాకాన్ని 1947 జూలై 22 జరిగిన సమావేశంలో రాజ్యాంగ సభ ఆమోదించిందన్నారు. అనంతరం జాతీయ జెండాలతో పట్టణంలోని ఊరేగింపు నిర్వహించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి, ఆదిత్య, శ్రీవిద్య, సర్ సీవీ రామన్ విద్యార్థులు పాల్గొన్నారు.

సకాలంలో సెస్ చెల్లించాలి

జిల్లా శాఖా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు



పోడూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచా యతీలు, మున్సిపాలిటీలు జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన సెస్‌లను సకాలంలో చెల్లించి గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు కోరారు. పోడూరు మండలం జిన్నూరు శాఖా గ్రంథాలయాన్ని, ఈ గ్రంథాలయానికి అనుసంధానంగా ఉన్న వేడంగి, వడ్లవానిపాలెం పుస్తక పంపిణీ కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి బీడీపీలకు తగిన సూచనలు చేశారు. కేంద్రాలకు ఎక్కువ మంది పాఠకులు వచ్చేలా చూడాలని సూచించారు. జిన్నూరు శాఖా గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనను గ్రంథపాలకురాలు బి.జోగారత్నం, బీడీసీలు కొట్టి రామం, టి.ఉదయభాస్కర్ సిబ్బంది ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించండి

జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి గిరి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా అధికారి గిరి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరందించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ పశ్చిమగోదావరి జిల్లా అధికారి బీవీ గిరి సూచించారు. తాడేపల్లిగూడెంలోని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. నియోజకవర్గంలో ఆర్‌డబ్ల్యుఎస్ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్వహించిన పనులపై ఆరా తీశారు. కాంట్రాక్టర్‌లు త్వరగా పనులు పూర్తి చేయకపోతే పనులు వేరేవారికి ఇచ్చి పూర్తి చేయిస్తామని హెచ్చరించారు. డీఈ సోమేశ్వరరావు, ఏఈ బి. రాజాశ్రీనివాస్, ఎంఆర్‌సీ ఎం. రవికిరణ్, ఫీల్డ్ ఇంజనీర్ సత్యమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

యువతిని మోసగించిన యువకుడికి పదేళ్ల జైలు

ఏలూరు క్రైం/పెనుగొండ, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆపై పెళ్లికి నిరాకరించినట్లు ఒక యువకుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరు ఐదవ అదనపు జిల్లా కోర్టు (మహిళా కోర్టు) జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ మంగళవారం సాయంత్రం తీర్పుచెప్పారు. పెనుగొండ మండలానికి చెందిన యువతి కూలి పనులు చేస్తూ జీవిస్తోంది. అదే మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన అంజూరి ప్రసన్నకుమార్ మాయమాటలు చెప్పి ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి శారీరక సంబంధం కొనసాగించాడు. అనంతరం అతని తల్లిదండ్రుల సహకారంతో గల్ఫ్ వెళ్ళిపోయాడు. ఆ బాధితురాలి కుటుంబ సభ్యులపై ఒత్తిడి తీసుకొచ్చారు. బాధితురాలు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ మోహనరావు, సీఐ జీవీవీ నాగేశ్వరరావులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు ఏలూరులోని ఐదవ అదనపు జిల్లా కోర్టు(మహిళాకోర్టు)లో విచారణ సాగింది. ఈ కేసులో అంజూరి ప్రసన్న కుమార్‌పై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి మురళీకృష్ణ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున డి.వి.రామాంజనేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు కోర్టు కానిస్టేబుల్ తిమ్మరాజు, నాగబాబు, లైజనింగ్ ఆఫీసర్, ఏఎస్‌ఐ ఎస్ ప్రదీప్ కుమార్‌లు సహకరించారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు

పెదపాడు, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాత్రిపూట గస్తీలో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. రాత్రిపూట గ్రామాల్లోకి వస్తున్న చికెన్ వేస్ట్‌తో కూడిన వాహనాలను అడ్డుకునేందుకు, అలాగే రాత్రి గస్తీలో భాగంగా ఆదివారం తెలవారుజామున విధులు నిర్వహిస్తున్న పెదపాడు పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు దుర్గారావు, రమేష్‌లను కడిమికుంట గ్రామం వద్ద రెండు కార్లలో వచ్చిన నలుగురు కానిస్టేబుళ్ల విధులకు ఆటంకం కలిగించారంటూ ఫిర్యాదు చేశారు. కానిస్టేబుళ్ల ఫిర్యాదు మేరకు ఎస్.ఐ. కట్టా శారదాసతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ఏలూరు క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఇంట్లో కరెంటు పని చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రవాహం జరిగి ఒక వ్యక్తి మృతి చెందాడు. పెదవేగి మండలం రామచంద్రాపురానికి చెందిన చొదిమెళ్ళ యాకోబు(44)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం 3.30 గంటలకు తన ఇంటి వద్ద కరెంటు పనిని యాకోబు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న యాకోబును కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఇంటి నుంచి అలిగివెళ్లిన బాలిక అప్పగింత

ఏలూరు క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి స్కూల్ యునిఫాంలో ఉన్న బాలిక ఆటోలో వెళ్తుండగా తనిఖీలు చేస్తున్న పోలీసులు వెంటనే ఆ బాలికను గుర్తించి విచారణ చేశారు. తల్లిపై అలిగి విజయవాడ వెళ్లి తిరిగి వస్తున్నట్టు గుర్తించారు.దీంతో ఆ బాలికను సంరక్షించి ఆమె తల్లిని పిలిపించి అప్పగించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు రూరల్ ఎస్‌ఐ సిహెచ్ దుర్గా ప్రసాద్ వారి సిబ్బంది కలిసి సోమవారం అర్ధరాత్రి ఏలూరు నగరంలో తనిఖీలు చేపట్టారు. ఏలూరు పాతబస్టాండ్ వద్ద ఆటోను ఆపి తనిఖీలు చేయగా ఆటోలో స్కూల్ యూనిఫాం ధరించిన బాలిక ఉండడంతో ఆ బాలికను విచారించారు. తన తల్లిపై కోపంతో ఇంటి నుంచి విజయవాడ వెళ్లి తిరిగి ఏలూరు వచ్చినట్టు తెలిపింది. దీంతో ఆ బాలికను సంరక్షించి వెంటనే ఆమె తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చి బాలికను అప్పగించారు.



ఏలూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీలకు సిద్ధంగా ఉన్న ఈగల్ టీమ్



ఏలూరులో కారును తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు

విస్తృతంగా ఈగల్ టీమ్ తనిఖీలు



బ్యాగులు తనిఖీ చేస్తున్న ఈగల్ టీమ్

ఏలూరుక్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు ఈగల్ టీమ్ ఐజీ ఎ.రవికృష్ణ, జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్‌ల ఆదేశాలతో ఈగల్ టీమ్, సివిల్ పోలీస్, రైల్వే పోలీస్, ఆర్పీఎఫ్ పోలీస్ సిబ్బంది కలిసి మంగళవారం మధ్యాహ్నం ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో రైళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఒరిస్సా వైపు నుంచి ఏలూరు మీదుగా విజయవాడ వెళ్లే రైళ్ళల్లో ఈ తనిఖీలు కొనసాగించారు. పోలీసు జాగిలంతో ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీలు చేయించారు. రైలులో కూడా ఈ తనిఖీలు కొనసాగించారు.ఈ తనిఖీల్లో ఏలూరుటూటౌన్ సీఐ లక్ష్మీనారాయణ, ఈగల్ టీమ్ ఆర్ఎస్‌ఐ ఉదయ భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ సూర్యచక్ర, డాగ్ స్క్వాడ్ బృందాలు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

జిల్లాలో నేరాల నియంత్రణకు అక్రమ రవాణాలపై పోలీసులు విస్తృతంగా రాత్రి వేళ తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం సబ్ డివిజన్ల పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రహదారులపై సోమవారం అర్ధ రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ చేయించారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులను ఫేస్ రికగ్నిజేషన్ యాప్ ద్వారా పరిశీలన చేశారు.



ఆందోళన నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రైతు భరోసా కేంద్రంలో వైసీపీ కరపత్రాలు

సిబ్బంది పట్టించుకోకపోవడంపై టీడీపీ నాయకుల ఆగ్రహం



బయటపడిన వైసీపీ కరపత్రాలు

వీరవాసరం(భీమవరంటౌన్), జూలై 22(ఆంధ్రజ్యోతి): వీరవాసరం మండలం చింతలకోటి గరువు గ్రామ సచివాలయం కార్యాలయంలోని రైతు భరోసా కేంద్రంలో వైసీపీ కరపత్రాలు బయటపడ్డాయి. దీంతో వీరవాసరం టీడీపీ మండలాధ్యక్షుడు కొల్లేపర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన చేపట్టారు. బస్తాలకొద్దీ వైసీపీ కరపత్రాలు, జెండాలు నిల్వ ఉన్న సచివాలయ సిబ్బంది పట్టించుకోకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకుడు తనిష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతుభరోసా కేంద్రాన్ని వైసీపీ కార్యాలయంగా మార్చి కార్యకలాపాలు సాగిస్తూ పార్టీకి చెందిన కరపత్రాలు, జెండాలను రైతు భరోసా కేంద్రంలో ఉంచడంపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. సచివాలయ సిబ్బంది పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల 15రోజుల క్రితమే ఈ విషయాన్ని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లిన స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఈ సంఘటనపై తగుచర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు అధికారులను డిమాండ్ చేశారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



చందు(ఫైల్)

ముసునూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై ముసునూరు ఎస్‌ఐ ఎం.చిరంజీవి మంగళవారం కేసు నమోదు చేశారు. లోపూడి గ్రామానికి చెందిన బిల్లాబుది దానియేలు(చందు) విస్సన్నపేట ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ 21న హోమ్ సిక్ సెలవులపై ఇంటికి బయల్దేరాడు. అయితే ఇంటికి రాలేదు. చందు కోసం కోసం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. చందు కనిపిస్తే 91214 13949 నెంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

మోటారు సైకిల్ దొంగకు జైలు

ముదినేపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలిలో గత ఏడాది మోటారు సైకిల్‌ను దొంగిలించిన కేసులో నిందితుడైన పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలం ఊరదాళ్ళపాలెం గ్రామానికి చెందిన జొన్నల వెంకటేశ్‌కు జైలు శిక్ష పడింది. వెంకటేష్ మోటార్ సైకిల్‌ను దొంగిలించిన నేరం రుజువు కావడంతో మంగళవారం కైకలూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎం.శివకిరణ్ నిందితుడికి 164 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ముదినేపల్లి ఎస్‌ఐ ఎస్ వీరభద్రరావు తెలిపారు.

నకిలీ మద్యం కేసులో స్పిరిట్ సరఫరాదారుడి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు

పాలకొల్లు టౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల్లో నకిలీ మద్యానికి స్పిరిట్ సరఫరా చేస్తున్న ఒకరిని అరెస్టు చేశా రు. ఏలూరు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పశ్చిమ గోదావరి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించినట్లు పాలకొల్లు ఎక్సైజ్ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. నకిలీ మద్యం కేసుకు సంబంధించి స్పిరిట్ సరఫరా చేస్తున్న హైదరాబాదుకు చెందిన కృష్ణా ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ జి.మల్లికార్జునరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్చండి

భీమడోలు, జూలై 22(ఆంధ్రజ్యోతి) : బడిఈడు పిల్లల్ని బడిలో చేర్పి డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలని ఐసీడీఎస్ పీడీ పి.శారద సూచించారు. మంగళవారం భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గుండుగొలను, ఆగడాలలంక హైస్కూళ్లను పీడీ సందర్శించారు. బాలికలు, చదువు మధ్యలో నిలిపివేసిన వారిని పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అలాగే బాల్య వివాహాలను అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. సీడీపీవో రాజశేఖర్, ఎంఈవో శ్రీనివాసు, భాస్కరరావు పాల్గొన్నారు.

కూటమితో ఆస్పత్రికి మంచి రోజులు

జంగారెడ్డిగూడెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): నూతన ప్రభుత్వం వచ్చాక ఆస్పత్రులన్నీ బాగుపడుతున్నాయని జనసేన నేత, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తరపున పట్టణానికి చెందిన సొలస గుప్తా జ్ఞాపకార్థం ఆయన భార్య రాజకుమారి ఆర్థిక సహకారంతో ఏరియా ఆస్పత్రికి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ కరాటం రాంబాబు చేతుల మీదుగా మంగళవారం ఆస్పత్రి పర్యవేక్షకురాలు బేబీ కమలకు అందజేశారు. డాక్టర్ వజ్రకిరణ్, మానవత కార్యదర్శి టి.మధుకుమార్, జి.గోపాలకృష్ణ, త్రిపుర రమేశ్ పాల్గొన్నారు.

భూములు సర్వేచేసి అప్పగించండి

బుట్టాయగూడెం, జూలై 22(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం తమకు ఇచ్చిన భూములు ఎక్కడ ఉన్నాయో సర్వేచేసి అప్పగించాలని రామన్నగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్వాసితులు అందెల సీతారామరెడ్డి, వేట్ల ముత్యాలరెడ్డి మరికొందరు అధికారులకు విజ్ఞప్తి చేశారు. తమను రామన్నగూడెం పునరావాస కాలనీకి తరలించి రెండేళ్లు దాటుతున్నా కాలనీలో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన భూములు గిరిజనేతరుల భూములు కలిసి ఉండటంతో సర్వే రాళ్ళను గిరిజనేతరులు తొలగించారని అదేమిటని ప్రశ్నిస్తే అధికారులతో సర్వే చేయించుకుని భూములు తీసుకోవాలని చెప్తారన్నారు. భూములు ఎక్కడ ఉన్నాయో తెలియక ఇబ్బందులు పడుతున్నామని, కౌలుకు తీసుకున్నవారు సక్రమంగా కౌలు డబ్బులు ఇవ్వడంలేదన్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైన అధికారులు స్పందించి భూములు సర్వేచేసి ఎక్కడ ఉన్నాయో గుర్తించి అప్పగించాలని నిర్వాసిత గిరిజనులు కోరుతున్నారు.

నృత్య దర్శకుడు కేవీఎస్‌కు సత్కారం



ఏలూరు రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నృత్య దర్శకుడు, కళారత్న కె.వి.సత్యనారాయణ కళా, నాట్య రంగానికి చేస్తున్న సేవలకు గాను డాల్లాస్ నగరంలో అమెరికా తెలుగు సంఘం(ఆటా) ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రం జ్ఞాపికను అందించింది. ఆటా ప్రెసిడెంట్ ఎలెక్ట్ సతీశ్ రెడ్డి, రఘువీర్ మరిపెద్ది, సభ్యులు గోలి బుచ్చిరెడ్డి, శ్రీకాంత్ జొన్నల, రామ్ అన్నాడి, శ్రీనివాస్‌రెడ్డి, మాధవి, సుమన బీరం, నీరజ పాల్గొన్నారు. కేవీ సత్యనారాయణ శిష్య బృందం ప్రదర్శించిన కాలార్చన నృత్యరూపం అక్కడి ప్రేక్షకులను అలరించింది.

విద్యాభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పించండి



ఏలూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యాభివృద్ధిలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని కలెక్టరేట్‌లో మంగళవారం కలిసి కోరారు. తాను ఇటీవల భీమడోలు మండలం పోలసానిపల్లిలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలను సందర్శించానని, 600 మంది చదువుతున్నా సౌకర్యాలేవన్నారు. తరగతి గదులు పైకప్పులు లీకులు ఏర్పడ్డాయని, తలుపులు తుప్పుపట్టడం, పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలతో అస్తవ్యస్తంగా ఉందని పద్మశ్రీ కలెక్టర్‌కు వివరించారు. ఈ సమస్యలను పరిశీలించి వెంటనే తగు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ వెట్రిసెల్వి జడ్పీ చైర్మన్‌కు హామీ ఇచ్చారు.

కల్లుగీత కార్మికులకు చేయూతనివ్వాలి

ఏలూరుకార్పొరేషన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): అష్టకష్టాలు పడుతున్న కల్లుగీత కార్మికులకు చేయూతను ఇవ్వాలని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తిగ నరసింహమూర్తి అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన కల్లుగీత కార్మిక సంఘ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన ఆహారంలాంటి అనేక ఔషధ గుణాలు ఉన్న కల్లుగీతను ప్రోత్సహించాలని కోరారు. గీత వృత్తిని కాపాడుకునేందుకు ఆగస్టు 18న గీత కార్మికులంతా మోకులు, ముస్తదులు ధరించి మన గోడు ఏలూరు కలెక్టర్‌కు తెలిపేందుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కల్లుగీత కార్మిక సంఘ నాయకులు సింహాద్రి ఆదినారాయణ, గూడవల్లి వెంకట మోహనరావు, బెజవాడ రామ్మోహన్, వేముల నాగేంద్ర, రొక్కం నాగరాజు ఉన్నారు.

రుణాల పరిమితి పెంపునకు డీసీసీబీ నిర్ణయం

ఏలూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): రుణపరిమితి దాటిన సొసైటీలకు అదనపు రుణం అందజేయడానికి డీసీసీబీ నిర్ణయించింది. మంగళవారం డీసీసీబీ కార్యాలయంలో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు పాలసీ మేటర్లపై చర్చించారు. డీసీసీబీ ఐవో, డీజీఎం, ఆప్కాబ్ డీజీఎం పాల్గొన్నారు.

హోంమంత్రి పర్యటనను విజయవంతం చేయండి

లింగపాలెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలంలో రాష్ట్రహోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పర్యటించనున్నారని ఈ పర్యటనను విజయవంతం చెయ్యాలని టీడీపీ మండలాధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు అన్నారు. లింగపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొంటారని ఆయన తెలిపారు.

● జంగారెడ్డిగూడెం: హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటనను జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేఖ పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీనివాసపురంలో టీడీపీ మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శేష మాట్లాడుతూ బుధవారం చింతలపూడిలోని ఆర్కే ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే సభకు కూటమి నాయకులంతా హాజరుకావాలన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల ఏర్పాటుపై చర్చ



జీలుగుమిల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ గ్రామ కమిటీల ఏర్పాటుకు జీలుగుమిల్లిలో నియోజకవర్గ, మండల పరిశీలకులు ఎ.వెంకటనారాయణ, ఆర్.కృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కొద్ది రోజులుగా గ్రామ కమిటీల ఏర్పాటుపై తాత్సారం జరుగుతోందని కొందరు పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పార్టీ మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి అధ్యక్షతన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పరిశీలకులు మండల స్థాయిలో మంగళవారం సమావేశం నిర్వహించారు. మండలంలో 7 పంచాయతీల్లో గ్రామ కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయని, జీలుగుమిల్లి, పి.రాజవరం, దర్భగూడెం, రాచన్న గూడెం, ములగలంపల్లి పంచాయతీల్లో పోటీ ఏర్పడటంతో వాయిదా పడ్డాయన్నారు. త్వరలో ఆయా గ్రామాల్లో కమిటీలు పూర్తి చేస్తామన్నారు. ఉండల్లి సోమసుందరం, నాలి శ్రీను, చిర్రి వెంకటేశ్వరావు, బాసిన రాజబాబు, గూడపాటి పుల్లయ్య, వనమ వెంకటేశ్వరావు, చేప రవి, తోట బాలు, జాస్తి సత్యనారాయణ, ఉండవల్లి కిరణ్ ఉన్నారు.

అచ్యుతానంద మృతికి సీపీఐ సంతాపం

ఏలూరుకార్పొరేషన్, జూలై 22(ఆంధ్రజ్యోతి) : కేరళ మాజీ సీఎం, రాజకీయ కురువృద్ధుడు, సీపీఎం నాయకులు కామ్రేడ్ వి.ఎస్.అచ్యుతానందన్ మృతికి సీపీఐ ఏలూరు సమితి మంగళవారం సంతాపం తెలిపింది. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం పార్టీకి ఆయన మృతి తీరనిలోటన్నారు.

నగర పంచాయతీ ప్రత్యేకాధికారి నియామకం పొడిగింపు

చింతలపూడి, జూలై 22(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ ప్రత్యేక అధికారిగా జంగారెడ్డిగూడెం ఆర్డీవోగా ఎం.వి.రమణను నియమిస్తున్నట్టు తెలిపారు. 2026 జనవరి 8వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా వైసీపీ ఆందోళన

జంగారెడ్డిగూడెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టుకు నిరసనగా మంగళవారం వైసీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. వైసీపీని బలహీన పర్చాలని ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టినా వైసీపీ బెదరదని మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి జెట్టి గురునాథరావు, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. వైసీపీ మండలాధ్యక్షుడు ఓరుగంటి నాగేంద్ర, పట్టణ అధ్యక్షుడు కర్పూరం గవరయ్య గుప్తా, బీవీఆర్ చౌదరి,ముప్పిడి శ్రీనివాసరావు, పీపీఎన్.చంద్రరావు, బత్తిన చిన్నా పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున గుండేరు వంతెన



కామవరపుకోట, జూలై 22(ఆంధ్రజ్యోతి): కళ్లచెరువు పంచాయతీ పరిధిలోని గుండేరు వంతెనపై గతంలో తాత్కాలికంగా వేసిన రోడ్డు ఒక పక్కన ఒరిగి ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఎటువంటి నష్టం జరగకుండా ముందస్తుగానే అధికారులు తగు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. ఈ వంతెన పటిష్టతపై ఆరా తీసి మరమ్మతులు నిర్వహించాలని, ప్రమాదం జరగకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ప్రజానీకం అభ్యర్థిస్తున్నారు.

ఉత్సాహంగా ఇంటింటికీ టీడీపీ

ఏడాది సుపరిపాలనపై నాయకుల ప్రచారం

దెందులూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): దోసపాడులో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు సర్పంచ్ గోరింక యేసుమణి, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి గోదావరి డీసీ చైర్మన్ అత్తూరి చంద్రశేఖర్, మోదూరి వెంకటేశ్వరావులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం మాజీ సర్పంచ్ నెరుసు గంగరాజు, బొల్లే రాములతో కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ గ్రామాధ్యక్షుడు యేసోబు, అత్తులూరి శ్రీను, బ్యాంక్ అధ్యక్షులు బోడేటి మోహన్ పాల్గొన్నారు.

● దుగ్గిరాల దెందులూరు క్యాంప్ కార్యాలయంలో పెదపాడు, పెదవేగి మండల ఎంపీడీవో, తహసీల్దార్, పార్టీ మండలాధ్యక్షులు ఈడ్పుగంటి అనిల్, మరడాని రవి, ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీతతో సుపరిపాలనలో తొలిఅడుగు అర్జీలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు.ప్రజలు అభివృద్ధి చెందాలంటే అధికారుల పాత్ర కీలకమని ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అధికారులు వారధిలా పని చేయాలని ఎమ్మెల్యే చింతమనేని సూచించారు.

● బుట్టాయగూడెం: ప్రభుత్వం అందిస్తున్న పథకాల్లో ఏ ఒక్క అర్హుడిని విస్మరించేదిలేదని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఏపీ ట్రైకార్ చైర్మన్, పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం బుట్టాయగూడెం మండల కేంద్రంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పథకాలను కరపత్రాలు పంచుతూ పేదలకు వివరించారు. నాయకులు అనపర్తి వెంకట నారాయణ, కుందుల శ్రీను, జారం చాందినీ విద్యాసాగరిక, సున్నం నాగేశ్వరరావు, మనెల్లి బాలు, మర్రి రమేశ్, పసుమర్తి భీమేశ్వరరావు, మానికల శ్రీను, దెయ్యాల కృష్ణమోహన్ పాల్గొన్నారు.



ప్రచార పత్రాలు పంపిణీ చేస్తున్న బొరగం

ప్రకృతి వ్యవసాయమే మేలు

అవగాహన కల్పిస్తున్న అధికారులు
పంటల బీమా చేయించుకోవాలని సూచన



బయ్యన్నగూడెంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రాజెక్టు అధికారి బి.వెంకటేశ్ కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని బయ్యన్నగూడెం గ్రామంలో సాయికృష్ణ గోశాల ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. దీనిలో భాగంగా ఈ నెల 21 నుంచి మూడ్రోజుల పాటు రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నారని ఈ సదస్సులో రైతులంతా పాల్గొని కోరారు. మండల వ్యవసాయ శాఖాధికారి పోశారావు, సిబ్బంది పాల్గొన్నారు.

● లింగపాలెం: రైతులు తమ పంటలకు బీమా తప్పనిసరిగా తీసుకోవాలని పంటల బీమా వల్ల ప్రకృతి వైపరీత్యాలు, ఇతర ఘటనల వల్ల రైతులు తమ పంట నష్టపోతే పరిహారం పొందవచ్చని చింతలపూడి సహాయ వ్యవసాయ సంచాలకుడు వై.సుబ్బారావు అన్నారు.మండలంలోని లింగపాలెం, సింగగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్, ఉష, ప్రసూన, మోరంపూడి మల్లికార్జునరావు, టి.హేమలత, టి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

● కామవరపుకోట: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పంటలను పండించి రైతులు వారి ఆదాయాన్ని పెంపొందించుకోవాలని కామవరపుకోట మండల వ్యవసాయ శాఖాధికారి డి.ముత్యాలరావు పేర్కొన్నారు. మంగళవారం కళ్లచెరువు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ సార్వా 2025 సీజన్‌లో 5 వేల 700 ఎకరాల్లో వరి నాట్లు సాగు చేయడానికి సిద్ధం చేసి నట్టు ప్రస్తుతానికి నాట్లు మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయన్నారు.ఇప్పటి వరకు 310 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగులతో పాటు రైతాంగం పాల్గొన్నారు. వరి సాగు చేసే విధానంపై అవగాహన కల్పించారు.

● ఏలూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఆదాయం ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయ శాఖ ఏడీఏ అనిల్ కుమారి అన్నారు. మంగళవారం ఏలూరు డివిజన్ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జిలకు ప్రకృతి వ్యవసాయ శిక్షణలో భాగంగా వెంకటాపురం గ్రామంలో క్షేత్రస్థాయి సందర్శన, అవగాహన రైతు జయరాజు పొలంలో జరిగింది. ఈసందర్భం గా వరి ఏ-గ్రేడ్ నమూనా ఏటీఎం నమూనాలో వివరించారు.ఏడీఏ మాట్లాడుతూ ప్రతి ఆర్‌ఎస్‌కే పరిధిలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం జీవ ఉత్ప్రేరకాలు, కషాయాల తయారీ విత్తన గుళికలు తయారీని వివరించారు.



కళ్లచెరువులో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



చంద్రబాబుతో మాట్లాడుతున్న చంటి

సీఎంను కలిసిన ఎమ్మెల్యే చంటి

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం నారా చంద్రబాబునాయుడిని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) మర్యాదపూర్వకంగా కలిశారు.నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన సీఎంకు వివరించారు. ఎమ్మెల్యే వెంట ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ ఉన్నారు.

పట్టిసీమ పంపుల తగ్గింపు

పోలవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి):పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 2,124 క్యూసెక్కుల గోదావరి జలాలను దిగువకు విడుదల చేసినట్టు ఈఈ యేసుబాబు మంగళవారం తెలిపారు. కృష్ణా డెల్టా, ఉమ్మడి పశ్చిమ డెల్టాలలో భారీ వర్షాల వల్ల నీటి నిల్వలు ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 6 పంపులు 6 మోటార్లతో నీటిని విడుదల చేశామన్నారు.

ఫ్యాన్లు, పుస్తకాలు అందజేత

దెందులూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని, నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యను కేంద్రాల్లో అందిస్తున్నారని పోతునూరు టీడీపీ గ్రామాధ్యక్షుడు నున్న లక్ష్మణ్, రైతు సంఘం అధ్యక్షుడు గండి రాజా అన్నారు. మంగళవారం పోతునూరు పంచాయతీలోని కొత్తూరు అంగన్వాడీ కేంద్రం కోడ్ నెంబర్ 150 సెంటర్‌లో అంగన్వాడీ చిన్నారుల సౌకర్యార్థం రెండు ఫ్యాన్లు, పుస్తకాలు, పెన్నులను టీచర్ సత్యవతికి టీడీపీ నాయకులు లక్ష్మణ్, రాజాలు అందజేశారు.



నియామకపత్రం అందజేస్తున్న ఎస్పీ

కారుణ్య నియామకం

ఏలూరు క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో మరణించిన కె.డేవిడ్‌రాజు కుమారుడైన యశ్వంత్ పృధ్వీకి కారుణ్య ఉద్యోగ నియామకపత్రాన్ని ఎస్పీ కేపీఎస్ కిశోర్ మంగళవారం అందించారు. కొడమంచిలి డేవిడ్‌రాజు ఎక్సైజ్ శాఖలో కొవ్వూరులో పనిచేస్తూ 2024 అక్టోబర్ 31న అనారోగ్యంతో మరణించాడు. కారుణ్య ఉద్యోగ నియామకంలో భాగంగా ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ పోస్టును డేవిడ్‌రాజు కుమారుడైన యశ్వంత్ పృధ్వీకి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవడం తమ బాధ్యత అన్నారు. అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు

ఉంగుటూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి):బాదంపూడి, నీలాద్రిపురం హైస్కూల్లో మంగళవారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ ఆధ్వర్యంలో వీధి నాటికను ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయురాలు వై.వి.పద్మావతి, జిల్లా కార్యదర్శి రవిబాబు ఉపాధ్యాయులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఉత్కంఠగా టీడీపీ కమిటీ నియామకం

కామవరపుకోట నుంచి ఇరువర్గాల పోటీ

కామవరపుకోట, జూలై 22(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట గ్రామ కమిటీ ఎన్నిక అధిష్ఠానానికి సవాల్‌గా మారింది. అధ్యక్ష పదవికి రెండు వర్గాలు పోటీ పడటంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఈ మేరకు ఎంపిక ప్రక్రియను గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజుకు అప్పగించింది. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేయగా ఇరువర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ వర్గం అధ్యక్ష పదవిని ఘంటా లీలాకృష్ణ గోపాల్ (గోపి), ప్రధాన కార్యదర్శిగా కటికర్ల నాగరాజు(నాని) పేర్లను ప్రతిపాదించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ కోనేరు సుబ్బారావు వర్గం నుంచి అధ్యక్షుడిగా చింతపల్లి రత్న సురేష్(నాగు), ప్రధాన కార్యదర్శిగా బిరుదుగడ్డ రాజేశ్ పేర్లను ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు బాహాబాహీకి దిగాయి. ఇక చేసేది లేక ఇరువర్గాలు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తున్నట్టు బ్రహ్మరాజు తెలిపారు.



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

జీలుగుమిల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వద్ద మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బాధిత కుటుంబీకులకు అందజేశారు. పేద కుటుంబాల్ని సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వైద్య సేవలందిస్తూ ఆదుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు. బుట్టాయగూడెం మండలానికి చెందిన లక్ష్మడుగూడెం, రాజానగరానికి చెందిన వారికి రూ.1.55 లక్షలు చెక్కులను అందజేశారు.

విద్యుత్ సమస్యలపై 25న పరిష్కార వేదిక

జీలుగుమిల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక(సీజీఆర్‌ఎఫ్) ఎంపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో 25న ఉదయం 10.30 గంటలకు జీలుగుమిల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. సమావేశానికి చైర్మన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.రాజబాబు, స్వతంత్ర సభ్యులు ఎన్.మురళీకృష్ణ హాజరవుతారన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు.

శాకంబరి అలంకరణలో అమ్మవారు

ఏలూరుకార్పొరేషన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో విశ్వశాంతి సమాజం గౌరవ అధ్యక్షులు కొట్టు మధు వెంకట్రావు ఆధ్వర్యంలో ఆషాఢ మాసం నేపథ్యంలో రామమందిరంలోని సీతారామలక్ష్మణ హనుమంతుల వారికి వివిధ రకాల కూరగాయలతో ప్రత్యేక అలంకారం నిర్వహించారు. అనంతరం సీతమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో మేళతాళాలతో ఊరేగింపుగా ఆషాఢ సారెను రామకోటి మందిరానికి తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షులు గాదంశెట్టి రమేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి వేమా వెంకట సురేష్ కుమార్, కార్యదర్శి మానేపల్లి రామారావు, కోశాధికారి పాదర్తి బాలకృష్ణ బృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.



సచివాలయ సిబ్బందికి సన్మానం

కొయ్యలగూడెం, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా గ్రామాభివృద్ధికి కృషి చేసిన సచివాలయ సిబ్బందిని ఆ గ్రామానికి చెందిన సొసైటీ మాజీ డైరెక్టర్ తేలే శ్రీనివాస్ దంపతులు సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న వెంకటలక్ష్మమ్మ

మధ్యాహ్న భోజనం పరిశీలన

దెందులూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించాలని ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు.మంగళవారం నియోజకవర్గంలో పెదవేగి మండలం కొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించిన అనంతరం హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వెంకటలక్ష్మమ్మ వడ్డించారు.మధ్యాహ్న భోజనం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి అప్పలనాయుడు

‘ఆధారాలతోనే మిథున్‌రెడ్డి అరెస్టు’

ఏలూరు రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): పక్కా ఆధారాలతోనే వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు జరిగిందని ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు స్పష్టం చేశారు. మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన మద్యం, ఇసుక కుంభకోణాలపై సమగ్ర విచారణ జరిగితే ఎన్నో నమ్మలేని నిజాలు వెలుగులోకి వస్తాయన్నారు. వైసీపీ ప్రభుత్వం 2019 నుంచి మద్యం మాఫియాతో ఒప్పందం చేసుకుని ప్రణాళికబద్ధంగా రాష్ట్రాన్ని దోచుకుందని ఆరోపించారు.

భారీ బైక్ ర్యాలీకి పిలుపు : జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో నటించిన "హరిహర వీరమల్లు" చిత్రం ఈనెల 24వ తేదీన విడుదల సందర్భంగా బుధవారం పవన్,చిరంజీవి అభిమానులు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఏలూరు జనసేన కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అర్హులందరికీ పింఛన్: ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పింఛన్ అందజేస్తామని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రాధాన్యతా క్రమంలో నెరవేరుస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. త్వరలోనే టిడ్కో గృహాలు, నూతనంగా ఇళ్ల స్థలాలిస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులకు రాష్ట్రం దివాళతీసిందని, దీన్ని సరిచేసేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, బెల్లకొండ కిశోర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

భీమడోలు, జూలై 22(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుండుగొలను ప్రభుత్వ వైద్య అధికారి జాహ్నవి సూచించారు. జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వర్షాకాలంలో వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. నీటి కలుషితం వల్ల టైఫాయిడ్, కామెర్లు వచ్చే అవకాశం ఉందని ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆశవర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ రసీదులపై విచారణ

పోలవరం, జూలై 22(ఆంధ్రజ్యోతి):గూటాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం ఏలూరు జిల్లా దేవదాయ శాఖ కమిషనర్ శ్రీనివాస్ విచారణ చేపట్టారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం పేరిట నకిలీ రసీదులపై ఆలిండియా హేండ్లూమ్స్ బోర్డు మాజీ మెంబర్ చవల మహేశ్ ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు.ఈ విషయంపై విచారణ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఆలయ కార్యనిర్వహణాధికారి వద్ద వివరాలు సేకరించామని, రసీదు పుస్తకాలేమీ లేవన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపి విజిలెన్స్ అధికారులతో విచారణ చేయిస్తామన్నారు. ఉన్నతాధికారులతో పారదర్శకంగా విచారణ చేయాలని ఆలయం పేరిట చేసిన వసూళ్ల లెక్కతేల్చాలని మహేశ్ కోరారు.

ప్రాణదాన ట్రస్టుకు వితరణ

ద్వారకాతిరుమల, జూలై 22(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయంలో నిర్వహించే ప్రాణదాన ట్రస్టుకు ఓ భక్తుడి కుటుంబం ఆక్సిజన్ సిలెండర్, ఫ్లో మీటర్‌ను ఉచితంగా అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో భక్తుల ప్రాణాలు కాపాడటానికి ఉపయోగపడనుంది. విజయవాడకు చెందిన దాత ఎస్వీ ధనుంజయరావు కుటుంబం శ్రీవారు, అమ్మవార్లను దర్శించిన అనంతరం ఆ సెట్‌ను ప్రథమ చికిత్స వైద్యులు ఆర్.రాజేంద్ర ప్రసాద్, దాస్యం దుర్గా ప్రసాద్‌లకు అందజేశారు. సిలెండర్‌లో ఆక్సిజన్‌ను ఏడాది వరకూ ఉచితంగా ఫిల్లింగ్ చేయించి ఇస్తానని దాత చెప్పినట్లు వైద్యులు వివరించారు.

మంచినీటి కోసం ధర్నా

చింతలపూడి, జూలై 22(ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీలోని రెండవ సచివాలయం పరిధిలో పాత చింతలపూడి ఏరియాలో మంచి నీటి కోసం గ్రామస్థులు మంగళవారం ధర్నా నిర్వహించారు.సాయిరాం సెంటర్‌లో వాహనాలు నిలిపివేసి తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. గ్రామానికి చెందిన టి.బాబు మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా మంచినీరు సక్రమంగా రావడంలేదని, ఇదేమని మునిసిపల్ అధికారుల దృష్టికి తెచ్చినా ప్రయోజనంలేదన్నారు. నాలుగు బోర్లు ఉన్నప్పటికీ పనిచేయడంలేదన్నారు. దీంతో ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆదేశాలతో మునిసిపల్ ఏఈ రత్నాకర్ ఘటనా స్థలానికి వచ్చి బోరు పది రోజుల్లో వేయిస్తామని, మంచినీటి కొరత రాకుండా ట్యాంకర్ల ద్వారా అప్పటివరకు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

టి.నర్సాపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని రుద్రకోట రాజుగూడెం, తీగలవలస ఫీడర్లలో ఆర్‌డీఎస్ పనులు జరుగుతున్నందున 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో మార్పులు ఉంటాయని ఎలక్ట్రికల్ డివిజినల్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఉదయం 10నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి

ద్వారకాతిరుమల, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై రాజీలేని ప్రజాపోరాటాలు కొనసాగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి.బలరాం నాయకులకు పిలుపునిచ్చారు. ద్వారకాతిరుమల యూటీఎఫ్ భవనంలో తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరుగుతున్న సీపీఎం జిల్లా స్థాయి రెండ్రోజుల విస్తృత సమావేశాలు మంగళవారంతో ముగిశాయి. చింతలపూడి ఎత్తిపోతల వంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి మెట్ట రైతులకు సాగునీరు అందించాలన్నారు. సీపీఎం జిల్లా నేతలు ఆర్.లింగరాజు, జి.రాజు, ఎం.నాగమణి, కె.శ్రీనివాస్, ఇ.రామకృష్ణ పాల్గొన్నారు.

చెక్కులు అందించిన ఎస్పీ

ఏలూరుక్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో పనిచేస్తూ మరణించిన కుటుంబ సభ్యుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ కేపీఎస్ కిషోర్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖలోని డీసీఆర్బీలో ఏఎస్ఐగా పని చేస్తున్న డీవీవీఎస్ఎస్ మూర్తి అనారోగ్యంతో మరణించాడు. పోలీస్ శాఖ కార్పస్ ఫండ్ నుంచి విడుదలైన లక్ష రూపాయలను నగదు చెక్కును ఏఎస్ఐ మూర్తి సతీమణి వల్లీనాగ విజయలక్ష్మి, కుమారుడికి అందజేశారు. అసోసియేషన్ నుంచి వచ్చిన మరో లక్ష రూపాయల చెక్కును కూడా అందించారు. అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, జిల్లా పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఉచితంగా చెస్ కిట్ల పంపిణీ

ఏలూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చెస్ డే స్ఫూర్తితో నగరంలోని ఏలూరు జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో దీప్తి చెస్ అకాడమీ ఆధ్వర్యంలో చెస్ కిట్ల పంపిణీని చేపట్టినట్టు అసోసియేషన్ కన్వీనర్ వేల్పూరి వాసుదేవరావు, బీజేపీ జిల్లా నాయకులు లక్కోజు అనిల్ తెలిపారు. చెస్‌తో మెదడకు పదనుపెట్టి ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని వారు ఆకాంక్షించారు. సిట్ కంప్యూటర్స్ అధినేత కావూరి వేణుగోపాల్, దీప్తి చెస్ అకాడమీ డైరెక్టర్ కృష్ణకుమారి, సీనియర్ చెస్ కోచ్ దేవరపల్లి లక్ష్మణరావు, వైఎస్ సూర్యనారాయణలు పాల్గొన్నారు.

ఆఫీస్ అసిస్టెంట్ కోర్సుకు ఉచిత శిక్షణ

కైకలూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): యువతకు ఉచిత శిక్షణ అందించేందుకు అర్హత కలిగిన వారు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎన్. శాంతిజ్యోతి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్‌హబ్ ఆధ్వర్యంలో కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆఫీస్ అసిస్టెంట్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారని, పదో తరగతి పాసై 18-30 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 62811 17595, 97013 57315 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్ల దగ్గర్లో ఉన్న చెట్లు కొట్టే పనులు నిర్వహిస్తారని అందువల్ల సబ్‌స్టేషన్ పరిధిలోని గోనెపాడు ఫీడర్‌కు విద్యుత్ సరఫరాను బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలిపివేస్తామని ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. పల్లెవాడ, గోనెపాడు, భుజబలపట్నం, చటాకాయ, నత్తగుల్లపాడు గ్రామాల్లోని గృహ, వాణిజ్య, ఆక్వాపరిశ్రమ విద్యుత్ వినియోగదారులందరూ గమనించి సహకరించాలని కోరారు.

గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముదినేపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పంట కాల్వల్లో పేరుకు పోయిన గుర్రపు డెక్క, తూడు తొలగింపునకు చర్యలు తీసుకునేందుకు జలవనరుల శాఖ ఈఈ ఆంజనేయ ప్రసాద్ చర్యలు చేపట్టారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో "కాల్వలు ఇలా... పొలాలకు నీరెలా" శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఈఈ కాల్వల్లోని గుర్రపు డెక్కను అత్యవసర ప్రాతిపదికన తొలిగించేందుకు ఎస్ఈ మోహనరావుతో చర్చించినట్లు తెలిసింది. అయితే నిధుల వినియోగంలో అడ్డంకిగా ఉన్న ప్రభుత్వ నిబంధనలను సడలించే అంశంపై కూడా చర్చిస్తున్నారు. డెక్క, తూడు తొలగింపు పనులు పూర్తి చేసినా అందుకు సంబంధించిన బిల్లులను 2026 మార్చి తర్వాతే చెల్లించాలన్న నిబంధనల వల్ల ప్రస్తుతం నీటి సంఘాల ప్రతినిధులు ఈ పనులు నిర్వహించేందుకు ముందుకు రాని విషయాన్ని కూడా ఈఈ గుర్తించారు. నామినేషన్‌పై నీటి సంఘాలకు అప్పగించి అగ్రిమెంట్లు పూర్తయినా డెక్క తొలగింపు పనులు నేటికీ చేపట్టకపోవటంపై ఈఈ దృష్టి సారించారు. పనుల నిర్వహణకు డీసీ చైర్మన్లు, నీటి సంఘాల అధ్యక్షులతో కూడా ఆయన చర్చిస్తున్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్చడమే లక్ష్యం


గురుకుల బాలికలతో మాట్లాడుతున్న సీడీపీవో

మునునూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): చదువు మధ్యలో మానివేసిన పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించడమే లక్ష్యమని ఐసీడీఎస్ సీడీపీవో టి.విజయ కుమారి అన్నారు. మంగళవారం మునునూరు, కాట్రేనిపాడు జడ్పీ పాఠశాలలతోపాటు గురుకుల బాలికల పాఠశాలను ఎంఈవో బీవీఎస్ సుబ్బారావుతో కలిసి ఆమె సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పరిశీలించి, చదువు మధ్యలో మానివేసిన వారి పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమన్నారు. అలాగే తల్లి దండ్రులు తమ అవసరాల కోసం పిల్లలను చదువు మానిపించవద్దని కోరారు. సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ కె.లక్ష్మీకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

మునునూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవో టి.విజయకుమారి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, బొమ్మల ద్వారా పిల్లలకు విద్యను నేర్పించారు. పిల్లల భవిష్యత్‌కు అంగన్‌వాడీ తొలి మెట్టు అని, ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు.



'హరిహర వీరమల్లు' పోస్టర్ ఆవిష్కరించిన కామినేని

కైకలూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): హరిహర వీరమల్లు చిత్రాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వరహాపట్నంలో జనసేన నాయకులు, పవన్‌కల్యాణ్ అభిమానుల ఆధ్వర్యంలో పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభిమానుల కోరికకు తగినట్లుగానే సినిమా ఉంటుందన్నారు. చిత్రం విడుదల సమయంలో అభిమానులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, నల్లగోపుల చలపతి, మంగినేని రామకృష్ణ, తోట లక్ష్మీ, కూటమి నాయకులు బీకేఎం నాని, పూల రామచంద్రరావు, కరేటి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు. హరిహర వీరమల్లు చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మంగళవారం కైకలూరులో ఆయన జనసేన పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చిత్రాన్ని విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలు, అభిమానులను కోరారు.

అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకోవాలి : సీఐ



కైకలూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి ఆలయం చుట్టూ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా స్థానిక ప్రజలే అడ్డుకోవాలని కైకలూరు రూరల్ సీఐ వి. రవికుమార్ అన్నారు. మంగళవారం కైకలూరు మండలం కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆలయం వద్ద చుట్టుపక్కల నివశించే ప్రజలు, దుకాణాదారులు, భక్తులకు రూములు అద్దెకు ఇచ్చే యాజమాన్యానికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు రూమ్‌లు తీసుకుంటే వారి వివరాలు, ఆధార్ ఐడీ ఖచ్చితంగా తీసుకోవాలన్నారు. రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎవరైనా పేకాట, ఇతర జూదాలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జూదాలను ప్రోత్సహిస్తే రూమ్‌ల యజమానులపై సైతం చట్టరీత్యా చర్యలు తీసుకుంటమాని హెచ్చరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్థానిక ప్రజలు సహకరించాలన్నారు. రూరల్ ఎస్సై వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుళ్ల వితరణ



ఆగిరిపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి-2 కొవ్వలి ఆనంద్‌కుమార్ అన్నారు. నెక్కలం గొల్లగూడెంలోని మోడల్ ప్రైమరీ స్కూల్‌కి మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇమేజ్ ఆధ్వర్యంలో ఇమేజ్ లయన్స్ మల్టీ ట్రస్ట్ నాలుగు టేబుల్స్‌ను అందజేశారని స్కూల్ హెచ్‌ఎం చూడామణి తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు పి. శశిధర్ మాట్లాడుతూ ట్రస్ట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా టేబుల్స్ పాఠశాలకు బహూకరించినట్లు తెలిపారు. లయన్స్ ట్రస్ట్ ట్రెజరర్ శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల అందజేత

ఆగిరిపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు హీల్ సంస్థ ద్వారా ఉచితంగా కృత్రిమ కాళ్లు అందించడం అభినందనీయమని విజయవాడ ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ ముఖ్య బాధ్యులు ఎస్.రామకృష్ణ అన్నారు. మంగళవారం తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ ఆర్థిక సాయంతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 13 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను క్లబ్ ప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. క్లబ్ కార్యవర్గ సభ్యులు లక్ష్మీపతి రావు, ఎంఎస్ దీక్షితులు, జి కృష్ణమూర్తి, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

పిట్టలవారిగూడెం ఎత్తిపోతల పథకం రద్దు?


పిట్టలవారిగూడెం ఎత్తిపోతల నిర్మాణ ప్రదేశం ఇదే

చాట్రాయి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలో నూజివీడు, తిరువూరు, మైలవరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 5 మండలాల్లో 50 వేల ఎకరాల భూములకు సాగు నీరు ఇచ్చే పిట్టలవారిగూడెం ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు నీరుతో పాటు సుమారు 70 గ్రామాలకు తాగు నీరందించడానికి గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఎత్తిపోతల పథకం రూపొందించిందని, ఈ పథకం రద్దు వార్తలతో రైతులు అయోమయంలో ఉన్నారు. 2017 సెప్టెంబరులో చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-2 శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబును ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు కలిశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-2 కాలువపై

అయోమయంలో రైతులు

ఎత్తిపోతలు ఏర్పాటుచేసి సాగు, తాగునీరందించాలని కోరారు. స్పందించిన చంద్రబాబు ఎత్తిపోతల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించి, తక్షణమే సమగ్ర సర్వే జరపాలని అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు సర్వేచేసి చింతలపూడి ఎత్తిపోతల ఫేజ్-2 ప్రధాన కాల్వపై చాట్రాయి మండలం పిట్టలవారిగూడెం, కోటపాడు, సూరంపాలెం గ్రామాల వద్ద ప్రధాన లిఫ్టులు, విస్సన్నపేట వద్ద స్టేజి-1 కాల్వపై ఆరుగొలనుపేట, చిత్తపూరు గ్రామాల వద్ద సబ్ లిఫ్టుల ఏర్పాటుకు డీపీఆర్ తయారుచేసి ప్రభుత్వానికి పంపారు. 2019 ఫిబ్రవరి 6న ఈ పథకానికి రూ.698.9 కోట్లు

> **పథకం రద్దు కాలేదు..**
> పిట్టలవారిగూడెం ఎత్తిపోతల పథకం రద్దు కాదు, ప్రస్తుతం పక్కన పెట్టారు. మెయిన్ ప్రాజెక్టు చింతలపూడి ఎత్తిపోతల పథకానికి క్లియరెన్స్ రావాల్సి ఉన్నందున దీనిని ఆపి ఉండవచ్చు.
> చిన్నబాబు, ఈఈ, చింతలపూడి ఎత్తిపోతల పథకం


2017లో చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం (ఫైల్)

మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలనా ఆమోదం ఇచ్చింది. ప్రాజెక్టుకు కావల్సిన కాంటూరు, భూసేకరణ ప్లాన్లు తయారు చేస్తుండగా 2019 ఎన్నికల కోడ్‌తో పనులకు బ్రేక్ పడింది. అనంతరం వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పట్టించుకోలేదు. తాజాగా ఈ పథకం రద్దు కారణాలు తెలియక రైతులు నిరాశ చెందారు. అయితే పథకం రద్దు చేసినట్లు సంబంధిత అధికారులు ధ్రువీకరించ లేదు.

కొండంగి ఎత్తిపోతలతో వేల ఎకరాల్లో సాగు : కామినేని


కొండంగి ఎత్తిపోతల పథకాలను పునః ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కలిదిండి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కొండంగి ఎత్తిపోతల పథకాల ద్వారా సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తుందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలను పునః ప్రారంభించారు. అనంతరం కలిదిండి మార్కెట్ యార్డులో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల నుంచి ప్రవహించే ఉప్పుటేరులో తీపి నీరును లంక గ్రామాల తోపాటు గుర్వాయిపాలెం, కలిదిండి, పడమటిపాలెం, సానారుద్రవరం, కోరుకొల్లు వరకు సీబీ కెనాల్ ద్వారా అందిస్తామన్నారు. కాల్వ గట్లను పటిష్టం చేయటంలో వైసీపీ ప్రభుత్వం విఫలమవ్వటంతో సాగునీటి కొరత ఏర్పడిందన్నారు. సాగు నీటి సంఘాల ద్వారా గట్లు పటిష్ట పరిచి సీబీ కెనాల్‌కు సాగునీరు పుష్కలంగా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పెదకొమ్ముల్లేరు, పుల్లవ డ్రెయిన్ల పూడికతీత పనులు పూర్తి చేశామన్నారు. రోడ్ల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఉప్పుటేరు వెంబడి ఆక్రమణలను తొలగించి ఉప్పుటేరును ప్రక్షాళన చేస్తామన్నారు. ఆవకూరు వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి, కోరుకొల్లు వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటానన్నారు. మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) చైర్మన్ మట్టా ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో ముడా ఆదాయానికి గండి కొట్టి నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముడా ఆదాయం నెలకు రూ. 50 లక్షలు వచ్చే విధంగా చర్యలు చేపట్టామన్నారు. కైకలూరు నియోజకవర్గంలో గుంతలు పడి అధ్వానంగా ఉన్న రోడ్ల మరమ్మతులకు ముడా నుంచి రూ. 40 లక్షల నిధులు మంజూరు చేస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, ఎత్తిపోతల కమిటీ చైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు, రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షులు తాడినాడ బాబు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చిట్టూరి రవీంద్ర, జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ కో-కన్వీనర్ నల్లగోపుల చలపతిరావు, ఇరిగేషన్ ఈఈ ఆంజనేయ ప్రసాద్, ఆర్‌అండ్‌బి ఏఈ విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నూజివీడు డీఎస్పీ ప్రసాద్

పాస్టర్‌లకు అండగా చంద్రబాబు

నూజివీడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పాస్టర్లకు సీఎం చంద్రబాబునాయుడు చేస్తున్న సహాయం, జరూసలేం యాత్రకు ఇస్తున్న సబ్సిడీ, విదేశీ విద్యకు అందిస్తున్న సహకారంపై టీడీపీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు ఈటె స్వామినాయుడు వివరించారు. నూజివీడు డివిజన్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గుడివాడ సురక్ష ఆసుపత్రి నూజివీడు కొండ రోడ్‌లోని ప్రార్థన మందిరంలో మంగళవారం నూజివీడు డివిజన్‌లోని పాస్టర్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రెవరెండ్ కేటీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య శిబిరం నిర్వహించారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సైబర్ నేరాలపై పాస్టర్లు మెలకువగా ఉండాలని సూచించారు. అంతర్జాతీయ ప్రసంగికులు బండి ఐజాక్, సురక్ష ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జగదీష్, డాక్టర్ భరత్ ప్రసంగించారు. నూజివీడు నలుమూలల నుంచి వచ్చిన పాస్టర్‌లకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.


జనసేనలో చేరిన దాకరం నాయకులు

జనసేనలో చేరిక

ముదినేపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం దాకరం గ్రామానికి చెందిన ఇద్దరు నాయకులు మంగళవారం జనసేనలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల జనసేన కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు సమక్షంలో ఆ గ్రామ ప్రముఖుడు వేములపల్లి రాజేష్, పంచాయతీ సభ్యుడు నగదాసి విజయకుమార్ పార్టీలో చేరి సభ్యత్వం తీసుకున్నారు. వారికి పార్టీ కండువా వేసి కన్వీనర్ వెంకటేశ్వరరావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేష్, విజయ కుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

దివ్యాంగ చిన్నారులకు 'భవిత' దన్ను

మండవల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): మానసిక, శారీరక దివ్యాంగులైన పిల్లలకు భవిత కేంద్రం ఎంతో ఉపయోగకరమని హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు పి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని లోకుమూడి జడ్పీ హైస్కూల్ వద్ద మంగళవారం మానసిక, వికలాంగులైన పిల్లలకు టీచర్ సునీత ఫిజియోథెరపీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు మానసికంగా పరిపక్వత చెందేందుకు టీచర్లు కృషి చేయాలని కోరారు.

ముసునూరు: మండలంలోని రమణక్కపేట మెయిన్ పాఠశాలలో ఉన్న భవిత సెంటర్‌లో మంగళవారం దివ్యాంగులకు ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. 10 మంది దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రశాంతి చికిత్స అందించారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వం దివ్యాంగులకు చికిత్స, ఉపకరణాలు, అనేక సౌకర్యాలను ఉచితంగా అందిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐఈఆర్పీలు లక్ష్మీనారాయణరావు, జె.నాగ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

మండవల్లి జూలై 22(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, ఉపాధి, ఆర్థికాభివృద్ధే కూటమి లక్ష్యమని టీడీపీ మండవల్లి క్లస్టర్, నీటి సంఘం అధ్యక్షుడు కూనపురెడ్డి కోటేశ్వరరావు పేర్కొన్నారు. మండవల్లి, కానుకొల్లు, లింగాల, లోకుమూడి, భైరవపట్నం గ్రామాల్లో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది కూటమి పాలనపై నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచిపెట్టారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లిబోయిన రాజేష్, నాయకులు మారగాని చిన్నబాబు, లింగాల సర్పంచ్ సురేష్, మాజీ సర్పంచ్ కాసగాని కొండ, తదితరులు పాల్గొన్నారు.


లింగాలలో కరపత్రాలు అందజేస్తున్న దృశ్యం



సూచనలిస్తున్న మామిడి శాస్త్రవేత్తలు


పాల్గొన్న రైతులు

శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే మధుర ఫలాలే!

నూజివీడులో ప్రపంచ మామిడి దినోత్సవం

నూజివీడు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మామిడి దినోత్సవం సందర్భంగా నూజివీడు మామిడి పరిశోధన కేంద్రంలో మామిడి రైతులతో ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఉద్యానవనవన శాఖ అధికారులు మామిడి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులను వివరించారు. నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం ముఖ్య అధికారి డాక్టర్ బీకేఎం లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏలూరు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి డాక్టర్ ఎస్. రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మామిడిలో కొమ్మ కత్తిరింపులు, ఎరువుల నిర్వహణపై సూచనలిచ్చారు. వీటి నిర్వహణకు హెక్టార్‌కు రూ. 20 వేల ప్రభుత్వ రాయితీ ఉందని, ప్రతి గ్రామంలో రైతు సేవా కేంద్ర పరిధిలో ఇద్దరు లేక ముగ్గురు ఆదర్శ రైతులను ఎంపిక చేసి శాస్త్రవేత్తలు తెలిపిన సూచనలు, యాజమాన్య పద్ధతులు క్షేత్రస్థాయిలో రైతులు పాటించేలా చూడాలని అధికారులకు తెలిపారు. మామిడిలో ముందస్తు పూత రావడానికి సరైన యాజమాన్య పద్ధతులు చేపట్టడం ప్రభుత్వం ద్వారా అందే రాయితీలను ఆయన వివరించారు. ఎన్టీఆర్ జిల్లా ఉద్యానవనశాఖ అధికారి పి బాలాజీకుమార్ మాట్లాడుతూ రెడ్డిగూడెం మండలంలో మామిడి రైతులు సంఘటితమై పెట్టుబడులు తగ్గించుకొని నాణ్యమైన పురుగుమందులు ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో వాడుకొని లాభాలు పొందిన విధానాన్ని రైతులకు వివరించారు. నూజివీడు మామిడి కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. చెట్టుకు సరిపడా గాలి వెలుతురు వచ్చేలా కొమ్మ కత్తిరింపులు ఉండాలని సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రాధారాణి, జీఎస్ రాజు తదితరులు మామిడి పంటపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రైతుల సందేహాలకు సమాధానాలిచ్చారు.



ఏషియన్ స్కేటింగ్ పోటీలకు జెస్సీరాజు పయనం

దెందులూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడాకారిణి, దెందులూరు మండలం జోగన్నపాలెంకు చెందిన మాత్రపు సురేష్ కుమార్తె జెస్సీరాజు సౌత్‌కొరియాలో జరిగే ఏషియన్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైంది. ఈ మేరకు టోర్నీలో ఏపీ జట్టు నుంచి తొమ్మిది మంది ఎంపిక కాగా జెస్సీ ఒకరు కావడం గమనార్హం. ప్రతి రెండేళ్లకొకసారి జరిగే ఏషియన్ చాంపియన్‌షిప్‌లో ఆమె సత్తాచాటి పతకంతో తిరిగి రావాలని పలువురు క్రీడాభిమానులు ఆకాంక్షించారు. ఇప్పటికే పలు పతకాలతో సత్తాచాటిన ఆమె భారత ప్రధాని మోదీ పురస్కారం కూడా సాధించింది.

విస్తృతంగా ఈగల్ టీమ్ తనిఖీలు


ఏలూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీలకు సిద్ధంగా ఉన్న ఈగల్ టీమ్

ఏలూరు క్రైం, జూలై 22(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా నిర్మూలనకు ఈగల్ టీమ్ ఐజీ ఎ.రవికృష్ణ, జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్‌ల ఆదేశాలతో ఈగల్ టీమ్, సివిల్ పోలీస్, రైల్వే పోలీస్, ఆర్పీఎఫ్ పోలీస్ సిబ్బంది కలిసి మంగళవారం మధ్యాహ్నం ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో రైళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఒరిస్సా వైపు నుంచి ఏలూరు మీదుగా విజయవాడ వెళ్లే రైళ్లల్లో ఈ తనిఖీలు కొనసాగించారు. పోలీసు జాగిలంతో ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీలు చేయించారు. రైలులో కూడా ఈ తనిఖీలు కొనసాగించారు.ఈ తనిఖీల్లో ఏలూరుటూటౌన్ సీఐ లక్ష్మీనారాయణ, ఈగల్ టీమ్ ఆర్ఎస్ఐ ఉదయ భాస్కర్, హెడ్ కానిస్టేబుల్ సూర్యచక్ర, డాగ్ స్క్వాడ్ బృందాలు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతానందన్ మృతి తీరని లోటు

చాట్రాయి, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సీపీఐ నూజివీడు నియోజకవర్గ నాయకుడు ఈవి శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు పి. రాయకృష్ణంరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం పేర్కొన్నారు. పేద, అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం అచ్యుతానందన్ చేసిన కృషి మరువలేనిదని, ఆయన ఆశయాల సాధనకు వామపక్ష వాదులు అందరూ కృషి చెయ్యాలని కోరారు.

సాక్ష్యాధారాల్లేకుండా మిథున్ రెడ్డిని అరెస్టు చేశారు : దూలం

కైకలూరు, జూలై 22(ఆంధ్రజ్యోతి): జగన్ చుట్టూ ఉన్న బలమైన నాయకులను కూటమి ప్రభుత్వం కేసుల్లో ఇరికిస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, పార్లమెంట్ కన్వీనర్ సునీల్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం కైకలూరు సీతారామఫంక్షన్ హాలులో పార్టీ పరిశీలకుడు వంకా రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా ఎంపీ మిధున్‌రెడ్డిని అరెస్టు చేశారని సమావేశంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు.

రైతులు వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలి

చాట్రాయి, జూలై 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారులు ఇస్తున్న ఆధునిక సాంకేతిక సలహాలు పాటించి రైతులు లబ్ధి పొందాలని చనుబండ పీఏసీఎస్ అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాసరావు కోరారు. చనుబండలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులు, అధికారులతో కలిసి క్షేత్ర పరిశీలన చేశారు. ఏవో శివశంకర్ మాట్లాడుతూ వరిలో సూర్యరశ్మి తగిలే విధంగా కాలిబాటలు వేసుకోవాలన్నారు. సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. టీడీపీ నాయకులు జక్కంపూడి ప్రదీప్‌కుమార్, పరసా శ్రీను, అచ్చన శ్రీను, గవర గోపి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యలు

ఆగిరిపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలోని అన్ని వార్డుల్లో డ్రెయినేజీల్లో దోమల మందు పిచికారీ చేయించినట్లు అడవి నెక్కలం పంచాయతీ సర్పంచ్ వేమురాజు తెలిపారు. వర్షాకాలం కారణంగా పరిశుభ్రత పాటించకపోతే దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా సోకే ప్రమాదం ఉందన్నారు.

బైక్ గుంతలో పడి ఒకరికి గాయాలు

చాట్రాయి, జూలై 22(ఆంధ్రజ్యోతి): విజయవాడ-సత్తుపల్లి రహదారిలో కృష్ణారావుపాలెం గ్రామం వద్ద మంగళవారం ద్విచక్రవాహనం రహదారి గుంతలో పడి ఒక వ్యక్తి గాయపడ్డాడు. కృష్ణారావుపాలెం గ్రామం వద్ద తోట రవి ఇంటి సమీపాన రోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. సత్తుపల్లి నుంచి విస్సన్నపేట ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తి ఆ గుంతలో అదుపుతప్పి పడిపోయాడు. వెంటనే స్థానికులు అతనికి సపర్యలు చేశారు. అనంతరం సత్తుపల్లి ఆసుపత్రికి పంపారు. స్థానిక సర్పంచ్ చిమటబోయన పుల్లారావు మాట్లాడుతూ ఈ గుంత వద్ద ఇప్పటి వరకు 10 మంది గాయపడ్డారని, ప్రమాదకరంగా ఈ గుంతను పూడ్చాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదని వాపోయారు.

మోటారు సైకిల్ దొంగకు జైలు

ముదినేపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలిలో గత ఏడాది మోటారు సైకిల్‌ను దొంగిలించిన కేసులో నిందితుడైన పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలం ఉరదాళ్ళపాలెం గ్రామానికి చెందిన జొన్నల వెంకటేశ్‌కు జైలు శిక్ష పడింది. వెంకటేష్ మోటారు సైకిల్‌ను దొంగిలించిన నేరం రుజువు కావడంతో మంగళవారం కైకలూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎం. శివకిరణ్ నిందితుడికి 5 నెలల రెండు వారాలు (164 రోజులు) జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని ముదినేపల్లి ఎస్ఐ ఎఎస్ వీరభద్రరావు తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం


బిల్లాబుది దానియేలు

మునునూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థి మిస్సింగ్‌పై మునునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ వివరాల ప్రకారం మండలంలోని లోపూడి గ్రామానికి చెందిన బిల్లాబుది దానియేలు (చందు) విస్సన్నపేట ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ 21న హోమ్ సిక్ సెలవులపై ఇంటికి బయల్దేరాడు. అయితే ఇంటికి రాలేదు. చందు కోసం కోసం కుటుంబసభ్యులు చుట్టు ప్రక్కల వెతికినా కనిపించకపోవడంతో విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. చందు కనిపిస్తే 91214 13949 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.